Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9398191920.

సంపుటి : 01 సంచిక : 94 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ సోమవారం 07-4-2025 పేజీలు :12 వెల : 2/-

## ఊపందుకోనున్న
# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



- బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధిక కేటాయింపులు
- రూ.12,571 కోట్లను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- ఎంపిక ప్రక్రియను ముమ్మరం చేసిన అధికారులు
- ఈనెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించనున్న ప్రభుత్వం

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఊపందుకోనుంది. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్లకు పెద్దపీట వేసి ఈ పథకానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చింది. కాంగ్రెస్ పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్లను ఎక్కువగా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో కొత్త ఇళ్లను నిర్మించడమే కాకుండా గత ప్రభుత్వ హయాంలో వివిధ దశల్లో నిలిచిపోయిన రెండు పడక గదుల ఇళ్లను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్ర బడ్జెట్లో రూ.12,571 కోట్లను కేటాయించింది.

లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పనుంది. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కానీ వారి కోసం మరో జాబితా తయారు చేస్తోంది. రెండో విడతలో 30 వేల మందికి ఇళ్లు ఇవ్వనుండగా వారి జాబితాను ఈ నెలాఖరులోగా విడుదల చేయనుంది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12,571 కోట్లను కేటాయించింది. గత బడ్జెట్లో ఈ పథకానికి రూ.8,424.06 కోట్లను కేటాయించగా ఈసారి ఆ నిధులను రూ.4,147 కోట్లకు పెంచింది. ఏటా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తోంది. కానీ ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం చూస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏటా రూ.22,500 కోట్లు అవసరమవుతాయి. ఇందులో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను కేటాయించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేల రూపాయలను అందిస్తోంది. కేంద్ర వాటాగా రాష్ట్రానికి మరో రూ.1000 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 80.54 లక్షల దరఖాస్తులు రాగా అధికారులు వాటిని ఇందిరమ్మ ఇళ్ల యాప్తో సర్వే జరిపి ఎల్- 1,2,3 విభాగాలుగా వర్గీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై దృష్టి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున, ప్రతి గ్రామంలో లబ్ధిదారుల ఎంపిక ఉండేలా జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి 72 వేల లబ్ధిదారులతో జాబితాను రూపొందించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ గ్రామాన్ని వదిలేసి మిగతా గ్రామాల నుంచి ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాయి. పలు నియోజకవర్గాల్లో సంబంధిత జాబితాలు ఎమ్మెల్యేల చేతికి వెళ్లాయి. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల సూచనలను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకుంటూ, మొత్తంగా రెండు విడతల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందితో జాబితా రూపొందించారు. దాన్ని ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను ప్రకటించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అప్పటిలోగా కనీసం పునాది, పిల్లర్ల వరకు నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. అలాగే లబ్ధిదారుల ఖాతాలో సంబంధిత సొమ్ము జమచేసేందుకు సర్కారు సిద్ధమవుతోంది. అందుకు అనుగుణంగా అధికారులు కూడా ఆ ప్రక్రియను వేగవంతం చేశారు. మొదటి విడతలో మండలానికి ఒక గ్రామం చొప్పున 72 వేల మంది లబ్ధిదారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో చాలా మంది అనర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో 72 వేల మందికి గాను 42 వేల మందికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాలను ప్రభుత్వం జారీ చేసినట్లు సమాచారం. మిగతా 30 వేల మంది లబ్ధిదారులపై మళ్లీ విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండో జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టాలని జిల్లా అధికారులకు గృహ నిర్మాణశాఖ నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇటీవల జరిగిన సమావేశంలోనూ ఈ మేరకు గృహ నిర్మాణశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకం చేసి ఆ విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. లబ్దిదారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే : నిరుపేదలకు ఆవాస సదుపాయం కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ' పేరిట ఇళ్లు నిర్మించనున్న విషయం తెలిసిందే.



## శ్రీలంక నుంచి తిరిగొస్తుండగా రామసేతు దర్శన భాగ్యం కలిగింది:

**- ప్రధాని మోదీ**

- శ్రీలంకలో ముగిసిన ప్రధాని మోదీ పర్యటన
- ప్రత్యేక విమానంలో భారత్ కు తిరిగి రాక
- శ్రీరాముడు మనందరినీ ఐక్యం చేసే శక్తి అంటూ మోదీ ట్వీట్

**ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ శ్రీలంక పర్యటన**

ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ శ్రీలంక పర్యటన ముగించుకుని, తమిళనాడు వచ్చి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీలంక నుంచి ప్రత్యేక విమానంలో భారత్ చేరుకున్న ఆయన ఓ వీడియో పంచుకున్నారు. విమానంలో వస్తూ సముద్రంలోని రామసేతును చూశానని వెల్లడించారు. కొద్దిసేపటి క్రితం శ్రీలంక నుంచి తిరిగి వస్తుండగా... రామసేతు దర్శనం చేసుకునే అదృష్టం కలిగిందని తెలిపారు. దైవికంగా, యాదృచ్ఛికంగా... అయోధ్యలో బాలరాముడికి సూర్య తిలకం జరుగుతున్న సమయంలోనే ఇది చోటుచేసుకుందని వివరించారు. ఈ రెండింటి దర్శనం చేసుకునే అదృష్టం తనకు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. శ్రీరాముడు మనందరినీ ఐక్యం చేసే శక్తి... ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ మనపై ఉండాలి అని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.




## ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికన్ల నిరసన

వాషింగ్టన్ : అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ట్రంప్, ఎలాన్ మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు, దాదాపు 50 రాష్ట్రాల నుంచి ప్రజలు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత జరిగిన అతిపెద్ద నిరసన కార్యక్రమం ఇదేనని అక్కడి రాజకీయ వర్గాలు తెలియజేశాయి. ముందు చూపు లేకుండా ట్రంప్, మస్క్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల వాణిజ్య యుద్ధాలు జరుగుతాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తూ మస్క్ తీసుకున్న నిర్ణయంపైనా వారు నిరసన వ్యక్తం చేశారు. 'హ్యాండ్స్ ఆఫ్!' పేరుతో జనం దేశవ్యాప్తంగా 1200 పైచిలుకు ప్రదేశాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 'ట్రంప్ గో బ్యాక్', 'హ్యాండ్స్ ఆఫ్ డెమోక్రసీ', 'మస్క్ వాజ్ నాట్ ఎలెక్టెడ్' వంటి నినాదాలతో వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, షికాగో, మయామీ వంటి నగరాల్లో నిస్టేట్ క్యాపిటల్ భవనాలు, ఫెడరల్ కార్యాలయాల వద్ద వారు ఆందోళనలు చేస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలు, టారిఫ్‌లు విధింపు, మస్క్ చేతిలో ప్రభుత్వ డేటా గోప్యతపై ప్రజలు తమ ఆందోళనలను కేంద్రీకరించారు.

## వక్ఫ్ బోర్డులపై ఆధిపత్యాన్ని కేంద్రం కోరుకోవడం లేదు



న్యూఢిల్లీ : వక్ఫ్ బోర్డులపై ఆధిపత్యాన్ని కేంద్రం కోరుకోవడం లేదని, కానీ అవి చట్టానికి లోబడి పని చేసేలా చూడాలని అనుకుంటున్నదని, దాని వల్ల వాటి ఆస్తులను ముస్లిం సమాజం విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి కల్పన ప్రోత్సాహానికి ఉపయోగపడతాయని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఆదివారం స్పష్టం చేశారు. బిజెపి 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ, తుర్కియే, పలు ఇతర ముస్లిం దేశాల్లోని ప్రభుత్వాలు వక్ఫ్ ఆస్తులను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నాయని చెప్పారు. 'వాటిని (వక్ఫ్ బోర్డులను) నిర్వహిస్తున్నవారిని నిబంధనల ప్రకారం వ్యవహరించాలని మాత్రమే మేము కోరుతున్నాం. మీరు నిబంధనల ప్రకారం ఆ పని చేయవలసి ఉంటుంది' అని ఆయన చెప్పారు. 'మేము వక్ఫ్ బోర్డు కట్టడిని కోరుకోవడం లేదు. వాటి నిర్వాహకులు చట్టం పరిధిలో పని చేసి, నిర్ధారిత నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూడడం మా లక్ష్యం. వక్ఫ్ ఆస్తులు, నిధులను విద్యను ప్రోత్సహించడానికి, ముస్లిం సమాజం ఆరోగ్య సేవలు, ఉద్యోగావకాశాలు కల్పించడానికి అంకితం చేయాలి' అని బిజెపి అధ్యక్షుడు తెలియజేశారు. ప్రసంగానికి ముందు నడ్డా బిజెపి ప్రధాన కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపిలు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా సహా పలువురు పార్టీ నేతలు కార్యక్రమానికి హాజరయ్యారు.

## తిరుమల శ్రీవారి సేవలో ఏపీ హోంమంత్రి



2లో

-కుటుంబంతో కలిసి స్వామి వారి దర్శనం

-అభివృద్ధిలో రాష్ట్రం ముందుండాలని వేడుకున్నట్లు వెల్లడి

-రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి శు భాకాంక్షలు తెలిపిన హోంమంత్రి అనిత

## వక్ఫ్ చట్టంలో మార్పులకు రాష్ట్రపతి ఆమోదం






## పార్టీలో గుర్తింపు కోసం బండి రాటపడుతున్నారు: మహేశ్‌కుమార్

హైదరాబాద్-:: కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వమే తెలంగాణలో సన్నబియ్యం ఇస్తే.. మరి దేశమంతా ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సొంత పార్టీలో గుర్తింపు కోసం, పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బండి ఆరాటపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## డిలిమిటేషన్‌పై మా భయాలను పరిహరించాలి



# ఒక్క ఏడాదిలోనే ట్రంప్ ఆస్తి డబుల్..! ఇది ఎలా



2024లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న డొనాల్డ్ ట్రంప్, 2025 ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో 5.1 బిలియన్ డాలర్ల నికర విలువతో 700వ స్థానంలో నిలిచారు. క్రిప్టోకరెన్సీ వెంచర్లు, ట్రూత్ సోషల్ వంటి వ్యాపారాల ద్వారా ఆయన తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. న్యూయార్క్ కోర్టు ఆదేశాలను ఎదుర్కొన్నప్పటికీ, ట్రంప్ తన ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడంలో విజయం సాధించారు.%ఏడాది క్రితం అనేక చట్టపరమైన కేసులను ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో 5.1 బిలియన్ డాలర్ల నికర విలువతో 700వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆయనతో పాటు మరికొంత మంది కూడా అంతే ఆస్తులతో 700వ స్థానంలో ఉన్నారు. అయితే పన్నెండు నెలల క్రితం ట్రంప్‌కు ఇంత సంపద లేదు. ఫోర్బ్స్ ప్రకారం, గత 12 నెల్లో ఆయన తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. 2024లో ట్రంప్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పుల కోసం తన ఆస్తుల నికర విలువను పెంచి చూపించారంటూ ఆయన ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్ ఆస్తుల జప్తు కూడా ఆదేశించింది. అందులో ఆయన ఐకానిక్ 40 వాల్ స్ట్రీట్ భవనం కూడా ఉంది. దీంతో ట్రంప్ ఆర్థిక భవిష్యత్తు అనిశ్చితంగా అనిపించింది. కానీ ట్రంప్ ప్రతిఘటించారు.

ఆస్తుల జప్తును నివారించడానికి అవసరమైన బాండ్ మొత్తాన్ని 454 మిలియన్ డాలర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకు తగ్గించే విధంగా అతని న్యాయ బృందం కోర్టును ఒప్పించింది. తద్వారా పరిస్థితులను మార్చుకోవడానికి ట్రంప్‌కు సమయం దొరికింది. వెంటనే ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, ట్రూత్ సోషల్ మాతృ సంస్థను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గణనీయమైన నష్టాలు ఉన్నప్పటికీ, షేర్ విలువ పెరిగింది. స్టాక్ 72 శాతం క్షీణించినప్పటికీ, మార్చి 2025 నాటికి ట్రంప్ ఇప్పటికీ 2.6 బిలియన్ డాలర్ల వాటాను కలిగి ఉన్నారు. ఇది ఆయన సంపద పెరుగుదలకు దోహదపడింది. అలాగే 2024 అక్టోబర్‌లో ట్రంప్ వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ అనే క్రిప్టో ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఇది అనుభవం లేని పెట్టుబడిదారులను లక్ష్యంగా చేసుకుంది. ప్రారంభంలో అస్పష్టంగా ఉన్నప్పటికీ, ట్రంప్ అధ్యక్ష ఎన్నికల విజయం తర్వాత క్రిప్టో వ్యవస్థాపకుడు జస్టిన్ సన్ నుండి వచ్చిన హైప్‌తో ఈ ప్రాజెక్ట్ విలువ పెరిగింది.

ఈ వెంచర్ చివరికి ట్రంప్ సంపదకు 245 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని జోడించింది. ట్రంప్ అక్కడితో ఆగలేదు. డిజిటల్ టోకెన్ %మీంకాయిన్%ని ఆయన ఆవిష్కరించారు. ఇది సూపర్ సక్సెస్ అయింది. 350 మిలియన్ డాలర్లు ఆర్జించింది. 2024 చివరి నాటికి, ట్రంప్ క్రిప్టోకరెన్సీ వెంచర్ల అతనికి దాదాపు 800 మిలియన్ డాలర్ల ఆదాయం అందించినట్లు అంచనా. దీనితో ట్రంప్ క్రిప్టో కింగ్‌గా మారారు. ఇలా ట్రంప్ తన వ్యాపార తెలివి తేటలతో ఏడాదిలో తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. ఫోర్బ్స్ 2025 బిలియనీర్ల జాబితాలో రికార్డు స్థాయిలో 3,028 మంది బిలియనీర్లు ఉన్నారు. వీరి మొత్తం నికర విలువ 16.1 ట్రిలియన్ డాలర్లు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, ఆయన సన్నిహిత సలహాదారు ఎలోన్ మస్క్ తో పోలిస్తే ట్రంప్ సంపద ఇప్పటికీ చాలా తక్కువ. 342 బిలియన్ డాలర్ల సంపదతో మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.భవిష్యత్తు అవసరాలు, ఆర్థిక భరోసా కోసం ప్రతి ఒక్కరూ వివిధ మార్గాలలో పెట్టుబడులు పెడతారు. దీర్ఘకాలంలో వాటి నుంచి అధిక సంపద వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకుంటారు. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు పెట్టేవారు విపరీతంగా పెరిగారు. వాటిలో ఎస్ఐపీ (సిప్) విధానంలో చాలామంది ఇన్వెస్ట్ చేస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో మాంద్యం భయాలు ఎక్కువైన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఐటీ, మెటల్స్ రంగాల్లో పెట్టుబడులను నివారించాలని, వీటికి బదులుగా ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఫైనాన్స్ లలో పెట్టుబడులను విస్తరించాలని సూచిస్తున్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు విధించారు. దీనిలో భాగంగా మన దేశం నుంచి వెళ్లే వాటిపై 27 శాతం చెల్లించాలి. ఏప్రిల్ 9 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి. దీని తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి పడిపోతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ, మెటల్ రంగాలకు పెట్టుబడి దారులు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ట్రంప్ చర్యల నేపథ్యంలో భారతీయ పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐటీ, మెటల్ తదితర రంగాలకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. ఎందుకంటే ఈ రంగాలు ఒడిదొడుకులకు లోనుకావొచ్చని వారి అభిప్రాయం. వాటికి బదులుగా ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఫైనాన్స్ రంగాలలో ఇన్వెస్ట్ మెంట్ మంచిదని చెబుతున్నారు.

అమెరికా ఊహించిన దానికంటే ఎక్కువగా సుంకాలు విధించిందని ఆర్థిక వేత్తల వాదన. దీని వల్ల ఐటీ, లోహాలు వంటి రంగాల నెమ్మదించాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఆందోళనను సూచిస్తుంది. అలాగే ఇతర దేశాలు కూడా ప్రతీకార వాణిజ్య చర్యలకు తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. ఈ కారణాలతో పెట్టుబడిదారులు అన్ని విషయాలను నిశితంగా గమనించాలి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల విధింపు తర్వాత భారతీయ మార్కెట్లు గందరగోళానికి గురై, దాదాపు ఒకటిన్నర శాతం క్షీణించాయి. నిఫ్టీ రెండు రోజుల పాటు తన కీలక మద్దతు స్థాయి 23,100 కంటే తక్కువకు పడిపోయి, 22,904.45 వద్ద స్థిరపడింది. చాలా రంగాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు.ఫార్మా రంగాన్ని ఇప్పటి వరకు సుంకాల నుంచి మినహాయించారు. అయితే ఇంతకు ముందు చూడని స్థాయిలో ఫార్మా రావడం ప్రారంభమవుతుందని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఏది ఏమైనా సుంకాల ప్రకటన తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి పడిపోతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ ప్రకటన తర్వాత చైనా కూడా ప్రతీకార చర్యలు తీసుకుంది. అమెరికా దిగుమతులపై 34 శాతం సుంకాన్ని విధించింది.

# గిన్నిస్ రికార్డ్ కొట్టేసిన ఎలుక.. దాని ప్రత్యేకత ఏంటో చూడండి



గిన్నిస్ రికార్డ్ కొట్టేసిన ఎలుక..దాని ప్రత్యేకత ఏంటో చూడండి ల్యాండ్‌మైన్స్ కనిపెట్టడంలో ఓ ఎలుక ప్రపంచ రికార్డును క్రియేట్ చేసింది. అపోపో సంస్థకు చెందిన రోనిన్ అనే ఆఫ్రికన్ జెయింట్ పౌచ్డ్ ర్యాట్ భూమిలో ఉన్న 100కుపైగా మందుపాతరలను, 15 పేలుడు పదార్థాలను కనిపెట్టి ప్రపంచ రికార్డును కొల్లగొట్టింది. మనుషులు నాలుగు రోజుల్లో తనిఖీ చేసే ప్రాంతాన్ని ఈ ఎలుక కేవలం అరగంటలోనే సెర్చ్ చేయగలదని అపోపో సంస్థ వారు చెబుతున్నారు.గిన్నిస్ రికార్డులు మనుషులేనా...మేం కూడా క్రియేట్ చేయగలం అంటోంది ఓ ఎలుక..ఎలుక రికార్డు క్రియేట్ చేయడమేంటి అనుకుంటున్నారా?%అవును అపోపో అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన రోనిన్ ఆఫ్రికన్ జెయింట్ పౌచ్డ్ ర్యాట్ మందుపాతరలను కనిపెట్టడంలో సరికొత్త ప్రపంచ రికార్డును క్రియేట్ చేసింది. ఈ ఎలుక ఇప్పటి వరకు దాదాపు 100కుపైగా మందుపాతరలు, ప్రమాదకరమైన యుద్ధ అవశేషాలను కనిపెట్టింది."అపోపో" అనేది ఒక స్వచ్ఛంద సంస్థ, ఈ సంస్థ టాంజానియా కేంద్రంగా పనిచేస్తుంది. ఈ సంస్థ ఎలుకలకు శిక్షణ ఇచ్చి మందుపాతరలను గుర్తించడానికి ఉపయోగిస్తుంది. ఈ సంస్థ దగ్గర 104 ఎలుకలు ఉన్నాయి. ఈ ఎలుకలను యుద్ధభూమిలో వదిలేసిన మందుపాతరలు, ఇతర ఆయుధాల్లో లభించే రసాయనాలను పసిగట్టేలా ఈ సంస్థ శిక్షణ ఇస్తోంది. ఈ ప్రయోగానికి ఎలుకలనే ఎంచుకోవడానికి ప్రధాన కారణం...ఇవి చిన్న సైజులో ఉండటం..మనిషి వాసనను త్వరగా పసిగట్టడం. ఈ ఎలుకల సైజు చిన్నగా ఉండటం.. అవి అడుగు పెట్టినా కూడా మందుపాతరలు పేలేంత బరువు లేకపోవడంతో వీటి ద్వారా పేలుడు పదార్థాలను సెర్చ్ చేయడం సులభం అవుతోంది. దీంతో ఈజీగా మందుపాతరలను కనిపెట్టవచ్చని అపోపో సంస్థవారు చెబుతున్నారు. ఇదే కాదు ఈ ఎలుకలు క్షయ వ్యాధిని కూడా గుర్తించగలవు.ఈ ఎలుకల్లో మరో ప్రత్యేకత ఉంది. ఇవి మనుషుల కన్నా చాలా వేగంగా పనిచేయగలవు..ఒక మనిషి నాలుగు రోజుల్లో మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేసే ప్రాంతాన్ని.. ఈ ఎలుకలు కేవలం అరగంటలోనే తనిఖీ చేయగలవని అపోపో సంస్థ వారు చెబుతున్నారు. రోనిన్ అనే ఈ ఆఫ్రికన్ జెయింట్ పౌచ్డ్ ర్యాట్ 2021 నుంచి ఇప్పటి వరకు 109 మందుపాతరలను కనిపెట్టినట్లు ఈ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే 2020లో ఇదే సంస్థకు చెందిన ఓ ఎలుక మాగ్వా ప్రాంతంలో 71 మందుపాతరలను గుర్తించడం ద్వారా గోల్డ్ మెడల్ సాధించగా..ఇప్పుడు రోనిన్ ర్యాట్ 100కుపైగా మందుపాతరలను కనిపెట్టి గిన్నిస్ రికార్డు క్రియేట్ చేసింది. ఈ సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 1,69,713 మందుపాతరలు, ఇతర పేలుడు పదార్థాలను గుర్తించింది.

# సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ



చెన్నై : సిపిఎం నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. సిపిఎం మహాసభలు తమిళనాడులోని మదురైలో ఈ నెల 2న ప్రారంభమై 6వ తేదీన ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా70 ఏళ్ల ఎంఏ బేబీని పార్టీ కొత్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 18మందితో కొత్త పొలిట్ బ్యూరో, 85మందితో పార్టీ కేంద్ర కమిటీని కూడా ఎన్నుకున్నారు. అయితే ఈ సారి కేంద్ర కమిటీలో 25శాతం మంది మహిళలు ఉండడం విశేషం.ప్రధాన కార్యదర్శి పదవికి ఎంఏ బేబీ పేరును పార్టీ కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సీతారాం ఏచూరి మృతి అనంతరం ఆ పదవి ఖాళీగా ఉంది. తాత్కాలికంగా కారత్ ఆ పదవిని నిర్వహిస్తూ వచ్చారు. మైనారిటీ కమ్యూనిటీ నుంచి సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నేత బేబీనే. ప్రధాన కార్యదర్శి పదవికి రేసులో సీనియర్ నేతలు అశోక్ ధవలే, బివి రాఘవులు, బృందా కారత్, మహ్మద్ సలీం తదితరులు పేర్లు ఉన్నప్పటికీ బేబీవైపే మొగ్గు చూపారు. ఇక పార్టీలో మరో వర్గం ఆలిండియా కిసాన్ సభ మాత్రం ధవలే పేరును గట్టిగా తెరపైకి తెచ్చినట్లు సమాచారం.%ఎంఏ బేబీ కొల్లాం జిల్లా ప్రక్కులంలో పిఎం అలెగ్జాండర్, లిల్లీ దంపతులకు 1954లో జన్మించారు. బేబీ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎస్ఎఫ్ఐ(అప్పట్లో కేరళ స్టూడెంట్ ఫెడరేషన్)లో పనిచేశారు. రాజనీతి శాస్త్రం అధ్యయనానికి డిగ్రీలో చేరినప్పటికీ దాన్ని పూర్తి చేయలేదు. ఆ తర్వాత అదే విభాగానికి జాతీయ అధ్యక్షుడు అయ్యారు. పార్టీ యువజన విభాగం డివైఎఫ్ఐలో పనిచేశారు. 1986 నుంచి 1998 వరకూ సిపిఎం రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు.ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థులను, యువతను సమీకరించి జైలుశిక్ష కూడా అనుభవించారు. 2006లో కేరళలోని కుండర నుంచి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకూ వీఎస్ అచ్యుతానంద్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2011లో తిరిగి కుండర నియోజకవర్గం నుంచే గెలుపొందారు. 2012 నుంచి సిపిఎం పొలిట్ బ్యూరోలో కొనసాగుతున్నారు. కాగా, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కొల్లాం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కాగా ఎంఏ బేబీకి భార్య, కుమారుడు ఉన్నారు.

### ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోడింగ్ పాఠాలు
### మూడు జిల్లాల్లో ముగిసిన తొలి ఏడాది శిక్షణ
### అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలు
### విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలను నేర్పించేందుకు ఈ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ ఏపీలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా ముగిసింది. మూడు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ (ఏఈఎఫ్) శిక్షణ అందించింది. గతేడాది దేశవ్యాప్తంగా ఏనిమిది రాష్ట్రాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. ఈమేరకు సమగ్రశిక్ష, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్ అనే స్వచ్ఛంద సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ మూడు జిల్లాల్లో 248 మందికిపైగా ఉపాధ్యాయులు, 7,381 మంది విద్యార్థులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో నేర్పించింది. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను గుర్తించి విశాఖపట్నంలో హ్యాకథాన్‌ను నిర్వహించారు. విజేతలకు ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు, టీవీలను బహుమతులుగా ఇచ్చి ప్రోత్సహించారు. కాగా, రాబోయే మూడు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది ఉపాధ్యాయులకు, 50 వేల మంది విద్యార్థులకు ఏఐ, కోడింగ్ నైపుణ్యాలను నేర్పించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఏఈఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త మాధవీలత తెలిపారు.

%గాఖిఒశీఆ ఖీబీఐతీవ జుఅఇ్ణఱఅవవతీ ం

## వక్ఫ్ చట్టంలో మార్పులకు రాష్ట్రపతి ఆమోదం
### స్వాతంత్ర్యం పూర్వపు ముసల్మాన్ వక్ఫ్ చట్టం రద్దు

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభల్లో వాడీగా వేడిగా చర్చ అనంతరం ఇంతకు ముందు పార్లమెంట్ ఆమోదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోద ముద్ర వేశారు. ముర్ము ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు 2025ను కూడా ఆమోదించారు. 'పార్లమెంట్ ఆమోదించిన ఈ దిగువ చట్టాన్ని శనివారం (5న) రాష్ట్రపతి అంగీకారం లభించింది. ఇందుమూలంగా సాధారణ సమాచారం కోసం ప్రచురించడమైంది: ది వక్ఫ్ (సవరణ) చట్టం 2025' అని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో తెలియజేసింది. 13 గంటలకు పైగా చర్చ అనంతరం రాజ్యసభ వివాదాస్పద శాసనానికి సమ్మతి తెలిపిన అనంతరం బిల్లును పార్లమెంట్ శుక్రవారం తెల్లవారు జామున ఆమోదించిన విషయం విదితమే.

బిల్లుపై చర్చలో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అవి బిల్లును 'ముస్లిం వ్యతిరేక'గాను, 'రాజ్యాంగవిరుద్ధం'గాను అభివర్ణించాయి. కాగా, ప్రభుత్వం ఈ 'చరిత్రాత్మక సంస్కరణ' మైనారిటీ సమాజానికి ప్రయోజనం కలిగిస్తుందని స్పష్టం చేసింది. రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది వోటు వేయగా, బిల్లుకు సభ ఆమోదం లభించింది. బిల్లును లోక్‌సభ గురువారం తెల్లవారు జామున ఆమోదించింది. సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది వోటు వేశారు. కాగా, రాజ్యసభ తన సమ్మతి తెలియజేయడంతో పార్లమెంట్ ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లును ఆమోదించింది. లోక్‌సభ ఇదివరకే బిల్లుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తరువాత ముసల్మాన్ వక్ఫ్ చట్టం 1923 రద్దు అయింది.

## డిలిమిటేషన్‌పై మా భయాలను పరిహరించాలి
### తమిళనాడు హక్కుల రక్షణకు పార్లమెంట్‌లో తీర్మానం ఆమోదించాలి
### ప్రధాని మోడీకి ఊటీ సభలో స్టాలిన్ డిమాండ్

ఉదకమండలం : ప్రతిపాదిత డిలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించిన తమిళనాడు ప్రజల భయాలను ప్రధాని నరేంద్ర మోడీ పరిహరించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆదివారం కోరారు. ఉదకమండలంలో ఒక అధికారిక కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ, తమిళనాడు హక్కులను ఏమాత్రం నియంత్రించని హామీగా పార్లమెంట్‌లో ఒక తీర్మానాన్ని ఆమోదించేలా మోడీ చూడాలని అన్నారు. ఉదకమండలంలో కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించి, కొత్త పథకాలను ప్రకటించిన తరువాత స్టాలిన్ ప్రసంగిస్తూ, ప్రతిపాదిత డిలిమిటేషన్‌కు సంబంధించిన ఆందోళనలతో ఒక వినతిపత్రం సమర్పణకు ప్రధానితో భేటీకి సమయం కోరానని తెలియజేశారు.'డిలిమిటేషన్‌పై వినతిపత్రం సమర్పణకు ఒక అపాయింట్‌మెంట్ కోరాం%ఈ%ఏ నేను ఈ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటున్నందున ప్రధానితో సమావేశంలో పాల్గొనలేని నా అశక్తత గురించి ఆయనకు తెలియజేసి, మా మంత్రులు తంగం తెన్నరసు, రాజా కన్నప్పన్‌లను పంపాను. ఈ సమావేశం ద్వారాను, మీ ద్వారాను డిలిమిటేషన్ భయాలను పరిహరించవలసిందిగా ప్రధానికి ఇందు మూలంగా విజ్ఞప్తి చేస్తున్నాను' అని స్టాలిన్ సభికులతో చెప్పారు. 'ఈ విషయమై పార్లమెంట్‌లో ఒక తీర్మానం ఆమోదించేలా కూడా మీరు (మోడీ) చూడాలి. ఇది (డిలిమిటేషన్) పార్లమెంటరీ సీట్ల తగ్గింపునకు దారి తీయదమే కాకుండా మా భవిష్యత్తు గురించి కూడా ఇది ఆందోళనకరం అవుతోంది' అని ఆయన చెప్పారు. 'పుదుచ్చేరి సహా 40 పార్లమెంటరీ సీట్లు ఉంటాయి. కానీ అధికార బిజెపి ప్రభుత్వం డిలిమిటేషన్ మా గొంతు నొక్కాలని చూస్తోంది' అని ఆయన అన్నారు. నిష్పాక్షిక డిలిమిటేషన్‌పై సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి) సమావేశాన్ని మార్చి 22న నిర్వహించారు.

దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ నాయకులు సమావేశానికి హాజరయ్యారు' అని ఆయన తెలిపారు. జనాభా వృద్ధిని సమర్థంగా నియంత్రించిన ఇతర రాష్ట్రాలతో పాటు తమిళనాడును రాపన్న డిలిమిటేషన్ ప్రక్రియలో శిక్షించడం జరగదని ప్రధాని మోడీ విస్పష్ట హామీ ఇవ్వాలని స్టాలిన్ సభలో ఉద్ఘాటించారు. డిలిమిటేషన్ ప్రక్రియను వ్యతిరేకించిన ఏకైక రాష్ట్రం తమిళనాడు అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. '(ప్రస్తుత రూపంలో డిలిమిటేషన్)ను సాగనిచ్చినట్లయితే, రాష్ట్రానికి పార్లమెంట్‌లో భారీ నష్టం వాటిల్లుతుంది' అని స్టాలిన్ హెచ్చరించారు. స్టాలిన్ అంతకుముందు రూ. 143.69 కోట్ల పెట్టుబడితో జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో నిర్మించిన కొత్త 700 పడకల ఆరోగ్య సేవ కేంద్రాన్ని ప్రారంభించి, తనిఖీ చేశారు.

## రైతులపై ప్రేమతో పనిచేయాలి..పగతో కాదు: హరీష్ రావు



హైదరాబాద్: కాళేశ్వరంను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ఉత్తర తెలంగాణకు అద్భుతమైన ప్రాజెక్టు అని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రాజెక్ట్ ల్లో నీళ్లున్నా, ఉద్దేశ పూర్వకంగానే విడుదల చేయడంలేదని హరీష్ రావు చెప్పారు. రైతులలే స్వచ్ఛందంగా కాల్వలు తవ్వుకొని నీళ్లు తీసుకుపోతున్నారని తెలియజేశారు. రైతులపై ప్రేమతో పనిచేయాలి.. పగతో కాదని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక కాలువల భూసేకరణకు రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. భూసేకరణకు రూ. 20 కోట్లు విడుదల చేయాలని.. ఆయకట్టు పెరుగుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.

సత్యమేవ జయతే



# కన్నుల పండగ సీతారాముల కళ్యాణం





### హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

సత్యమేవ జయతే/హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల, నస్తీపూర్, వడ్డేపల్లి, చింతలచెరువు, బోరుపట్ల, గోవింద్ రాజ్ పల్లి, హత్నూర, తదితర దేవాలయాల్లో వేద పండితులచే మంత్రోత్సవాల మధ్య సీతారాముల కళ్యాణం కన్నుల పండగ సాగింది ఈ కళ్యాణానికి స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, హాజరై మాట్లాడుతూ సీతారాముల కళ్యాణంలో అక్షింతలు వేసి సీతారాముల కళ్యాణ మహోత్సవ సందర్భంగా నియోజకవర్గ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండి పాడిపంట పిల్లాపాపలతో చల్లంగా ఉండాలని ఆ సీతారాములను వేడుకోవడం వేడుకోవడం జరిగిందన్నారు. అనంతరం వివిధ గ్రామాలలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు తీర్థ ప్రసాదాలు పుచ్చుకొని సీతారాములను ప్రధాన పూర్వవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర గౌడ్, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, మన్నే వీరేశం, ప్రభాకర్ రెడ్డి, ధనుంజయ గౌడ్, జుట్టు నరసింహులు, మధుసూదన్, వివిధ గ్రామాల భక్తులు తతలు పాల్గొన్నారు.

# సారపాకకు సీఎం.. అమలుగాని హామీలపై నిలదీస్తారనే భయంతో అక్రమ అరెస్టులు

సత్యమేవ జయతే - బాద్రాద్రి కొత్తగుడెం బాద్రాద్రి కొత్తగుడెం : సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకలో అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి. భద్రాచలం పర్యటనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం సారపాకలో గిరిజనతెగకు చెందిన బూరం శ్రీనివాసరావు నివాసంలో సీఎం రేవంత్ భోజనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో అమలు గాని హామీలపై ఎక్కడ నిలదీస్తారోనని, సీఎం కాన్వాయ్‌ని ఎక్కడ అడ్డుకుంటారోనని ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకులను అర్ధరాత్రి పోలీసులు అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి భద్రాచలం తరలించి అక్కడ నుంచి పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని, 14 నెలలు దాటినా ఆ హామీలు అమలు చేయకుండా ఏదో కొత్తగా.. ఆర్భాటంగా సన్న బియ్యం పంపిణీ అంటూ కొత్త పథకాలు తీసుకొస్తూ ముందుగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో సీఎం పర్యటన సారపాకలో ఉండటంతో బీఆర్ఎస్‌తో పాటు సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, మాల మహానాడు నాయకులు సారపాకతో పాటు భద్రాచలంలో నిలదీస్తారని అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులు చేయించినా, నిర్బంధాలకు గురిచేసినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని%ౌ% అరెస్టులకు భయపడేది లేదని నాయకులు విమర్శించారు. అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు, బెజ్జంకి కనకాచారి, బీఆర్ఎస్ యూత్ నాయకులు చల్లకోటి పూర్ణ, సోము లక్ష్మీ చైతన్య రెడ్డి, పంగి సురేష్, బూర్గంపహాడ్ సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, భద్రాచలం సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కమిటీ సభ్యులు వెంకట్రావ్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు కెచ్చేల రంగారెడ్డి, మాలమహానాడు నాయకులు అల్లాడి పాల్‌రాజ్‌లు తదితరులు ఉన్నారు.




## వాట్సాప్ గ్రూపుల్లోకి పోలీసులు?

**- గ్రామాల నుంచి నగరాల్లోని వార్డుల దాకా..**

**- ప్రజలు ఏమనుకుంటున్నారో తెలియాలి**

**- ప్రభుత్వం ఆదేశం.. రంగంలోకి ఇంటెలిజెన్స్**



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : 'మన ప్రభుత్వం గురించి.. పనితనం గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు? మనకు వ్యతిరేకంగా ఎవరెవరు పోస్టులు పెడుతున్నారు? వాళ్లను కట్టడి చేయడం ఎలా? గ్రామాల్లో మన పార్టీ పరిస్థితి ఎలా ఉంది? తక్షణమే తెలుసుకోండి..' అని సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రభుత్వ పెద్దలు అలా ఆదేశించారో లేదో.. నిఘా వ్యవస్థ ఇలా రంగంలోకి దూకినట్టు తెలిసింది. 'బుజ్జగిస్తారో.. భయపెడతారో.. ఎలా దారిలోకి తెచ్చుకుంటారో తెలియదు. గ్రామాల నుంచి, మండలం, జిల్లా స్థాయి వరకు వాట్సాప్ గ్రూపుల్లో మన సిబ్బంది ఉండాలె. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు సమాచారం అందించాలె. మీ కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుంది' అంటూ కిందిస్థాయి హోంగార్డు, కానిస్టేబుళ్ల వరకూ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమై న ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే స్టేషన్ల పరిధిలోని గ్రామాలపై కానిస్టేబుళ్లు, హోంగార్డులు వాట్సాప్ గ్రూపుల వేటలో నిమగ్నమైనట్టు తెలిసింది. 'అన్నా.. మీ గ్రూప్‌లలో యాడ్ చేయండి..'

గ్రామాల నుంచి ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వస్తే.. 'మీ గ్రామంలో ఎన్ని వాట్సా ప్ గ్రూపులు ఉండొచ్చు. పార్టీల గ్రూపు లు, ఊరి అభివృద్ధి గ్రూపులు, కులాల వారీగా, మతాల వారీగా, యూత్ గ్రూప్ లు, ఇంటిపేర్లతో ఉన్న గ్రూపులు, దావత్‌ల గ్రూపులు ఎన్ని ఉన్నాయి? వాటి అడ్మిన్‌లు ఎవరు? కొంచెం వివరాలు చెప్పండన్నా.. వాటిల్లో మమ్మల్ని కూడా యాడ్ చేయండి' అంటూ పోలీసులు బతిమాలుకుంటున్నట్టు తెలిసింది. గ్రా మాలు, పట్టణస్థాయి, రాష్ట్రస్థాయి గ్రూపు ల్లో ఏమేం జరుగుతున్నదో తెలుసుకునే బాధ్యతను ఆయా స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుళ్లు, ఇంటెలిజెన్స్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది భుజాన వేసుకున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో త్వరగా చేరడానికి మండలస్థాయి, గ్రామస్థాయిలోని కాంగ్రెస్ నాయకుల సహకారం తీసుకోవాలని పరోక్షంగా ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

టార్గెట్ 3 లక్షల గ్రూపులు..?

తెలంగాణలో 12,848 గ్రామాలు ఉండగా.. వాటికి ఆవాస గ్రామాలు కలిపి 13వేల పైచిలుకు ఉన్నాయి. వీటిల్లో ఒక్కో గ్రామంలో కనీసం విలేజ్ గ్రూపు-1, కులాల వారీగా-8, పార్టీల గ్రూపులు -4, మతాల వారీగా %-% 2, ఇంటిపేరిట- 5-10, దావత్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్-2-5 వరకు మొత్తంగా 20 వాట్సాప్ గ్రూప్‌లున్నాయి. ఇక నగరాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లోని వార్డుల వారీగా గ్రూపులు, నిరుద్యోగుల గ్రూపులు, విద్యా సమాచారం గ్రూపులు, జర్నలిస్టుల గ్రూపులు, దినపత్రికల గ్రూపులు, ఆఖరికి డ్రంక్ అండ్ డ్రైవ్ గ్రూపులు మొత్తం కలిపితే.. సుమారు 5.50 లక్షల పైగానే ఉంటాయని పోలీసుశాఖ అంచనాకు వచ్చినట్టు సమాచారం. వీటిల్లో కనీసం 3 లక్షల గ్రూపుల్లోని సమాచారం హెడ్ ఆఫీసుకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ఇందుకు ప్రత్యేకంగా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు నిర్దేశించినట్టు తెలిసింది.

## కాంగ్రెస్ పాలనంతా అవినీతిమయం.. రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో బీజేపీ అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి కిషన్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తుళ్ళ వీరేందర్ గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు హాజరయ్యారు. బీజేపీ జెండాను కేంద్ర మంత్రి ఆ వి ష్ క రి ం చా రు . ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దరిద్రమైన పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పాలన ఎలా ఉందో బిల్డర్లను అడిగితే తెలుస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బ తిన్నదన్నారు. కాంగ్రెస్ పాలనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జాతీయ రహదారులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆర్టికల్ 373ని రద్దు చేయడం జరిగిందన్నారు. రామ మందిరాన్ని నిర్మించి ప్రజల మన్ననలను పొందగలగడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి పాలన అంతం చేయాలన్నారు.

### శ్రీ రామనవమి సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించిన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు





సత్యమేవజయతేబినారాయణఖేడ్‌నారాయణఖేడ్ మున్సిపాలిటీలోని పురాతన శ్రీరామమందిరంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ కమిటీ ఎంపీకి పూర్ణకుంభంతో ఆలయ ప్రాంగణంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ శ్రీ సురేష్ కుమార్ షేట్కార్, ఆయన సతీమణితో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షేట్కార్, యువనేత సాగర్ షేట్కార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షేట్కార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, "శ్రీరాముని కృపతో అందరికీ శుభం కలగాలి" అని ఆశీర్వచనం తెలిపారు. రామమందిర పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల నుండి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనంగా, ఆలయం పూర్తి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రూ.5 కోట్ల నిధుల కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ రామనవమి ఉత్సవ కార్యక్రమంలో ఆలయ ఈవో, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే



సత్యమేవజయతేబినారాయణఖేడ్‌నారాయణఖేడ్ మండలం సంజీవనరావుపేట్ గ్రామానికి చెందిన నవీన ఆసుపత్రి వైద్య ఖర్చుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 10,000 రూపాయల చెక్కు లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగదీశ్వర్ చారి,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మండల పార్టీ అధ్యక్షులు పండరి, గ్రామ పార్టీ అధ్యక్షులు పోచయ్య, ఇస్మాయిల్, దస్తగిరి, లక్ష్మణ్ నాయక్, రమేష్ తదితరులు ఉన్నారు.

### శంకరంపేట్(ఎ) శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే





సత్యమేవజయతేబినారాయణఖేడ్‌శంకరంపేట్(ఎ) మండల కేంద్రంలో మరియు చీలపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకొని అన్న ప్రసాదాలు స్వీకరించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయిని మధుసూదన్, నారాగౌడ్,జహీరాబాద్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ పాటిల్ ,సంగమేశ్వర సెట్,మాజీ ఎంపీటీసీసాయి రెడ్డి , మాజీ సర్పంచులు సత్యనారాయణ రాములు ,పెరుమాళ్ గౌడ్, విగ్రం రాజన్ గౌడ్,శ్రీనివాస్, శంకరంపేట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు భక్తులు పాల్గొన్నారు .

## రెండు విడతల్లోనే డిగ్రీ అడ్మిషన్లు.. మరి బీటెక్, బీ ఫార్మసీలో సీట్లు రాని వారి పరిస్థితేంటి?



సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : - ఆ తర్వాత ప్రవేశాలకు నో చాన్స్.. కొత్త నిర్ణయంతో అడ్మిషన్లు తగ్గే అవకాశం 'సీట్లు ఎక్కువ.. చేరే వారు తక్కువ. ఏటా 50శాతంలోపే అడ్మిషన్లు. 50కిపైగా కాలేజీల్లో సున్నా అడ్మిషన్లు' వాస్తవ పరిస్థితులిలా ఉంటే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ల విషయంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. ఇది వరకు నాలుగైదు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించగా, ఇక నుంచి రెండు విడతలకే పరిమితం చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం కల్పించొద్దని పేర్కొంది. శుక్రవా రం జరిగిన వైస్‌చాన్స్‌లర్ల సమావేశంలో డిగ్రీ అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయగా, జూన్ 16 నుంచే ఫస్టియర్ క్లాసులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2024-25లో ఫస్టియర్‌లో 4,57,704 సీట్లుండగా, 1,96,442 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. 2.61లక్షల సీట్లు మిగిలాయి. చాలా కాలేజీల్లో 10-15 మంది మాత్రమే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు లేక కునారిల్లుతున్నాయి. నాలుగైదు విడతల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తేనే ఇలా ఉంటే.. మరీ రెండు విడతల్లోనే పూర్తిచేస్తే అడ్మిషన్లు మరింత తగ్గిపోయే ప్రమాదమున్నది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు జూలైలో విడుదలవుతాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తికావాలంటే జూలై గడిచిపోతుంది. జేఈఈ కౌన్సెలింగ్ తర్వాత మరో విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీ ఫార్మసీ కౌన్సెలింగ్ ఆగస్టు, సెప్టెంబర్‌లో పూర్తవుతుంది. మరీ జూన్‌లోనే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తిచేస్తే బీటెక్, బీ ఫార్మసీ, లా కోర్సులు, ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు రాని, సప్లిమెంటరీ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిందేనా..? అని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

# ఐదు లక్షలిస్తేనే టీచర్ ఉద్యోగం.. బేరంపెట్టిన విద్యాశాఖ ఆఫీసర్స్

- డీఎస్సీ-2002 నియామకాలకు అభ్యర్థుల నుంచి లంచం డిమాండ్
- అప్పట్లో అనర్హులకు ఉద్యోగాలు
- తాజాగా బాధితులకు ఉద్యోగాలివ్వాలని కోర్టు తీర్పు
- ఉద్యోగాలిచ్చేందుకు రూ.5లక్షలు డిమాండ్ చేసిన ప్రబుద్ధులు
- విద్యాశాఖ డైరెక్టరేట్‌కు నివేదిక
- నివేదిక మార్చాలంటూ ఒత్తిళ్లు



సత్యమేవ జయతే - కరీంనగర్

కరీంనగర్ : 'డీఎస్సీ పరీక్షలో ఎక్కువ మార్కులొచ్చాయి. మెరిట్ ఉన్నది. కానీ, టీచర్ ఉద్యోగం దక్కలేదు. చేయిదాకా వచ్చిన ఉద్యోగం చేజారింది. ఆ అభ్యర్థి తిరగని ఆఫీసులేదు. ఎక్కని మెట్టులేదు. ఈ ప్రయత్నంలో ఉద్యోగమైతే దక్కలేదు కానీ, మానసిక రోగి (పిచ్చివాడు) అయిపోయాడు' ఇలాంటి బాధితులెందరో! ఇలాంటి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ కరీంనగర్ జిల్లా. ఇది జరిగింది డీఎస్సీ-2002లో. బాధితులకు ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చింది. ఉద్యోగాల కోసం వెళ్తే రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఉద్యోగాలిస్తామంటూ విద్యాశాఖలోని కొంద రు బేరంపెట్టారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

**డీఎస్సీ-2002లో భారీ అక్రమాలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డీఎస్సీ-2002 లో అక్రమాలు జరిగాయి. అర్హులను పక్కనపెట్టి అనర్హులకు పోస్టులు కట్టబెట్టారు. హిందీ పండిట్ పోస్టుల భర్తీలో విచారణ చేపడితే 50కిపైగా పోస్టుల భర్తీలో ఉల్లంఘనలు జరిగినట్టు నిరూపితమైంది. 24 మందివి బోగస్ సర్టిఫికెట్లుగా గుర్తించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలోనూ అక్రమాలు జరిగిన ట్టు వెలుగులోకి వచ్చింది. 49 హిందీ పండిట్ గ్రేడ్-2 పోస్టులు, 85 ఎస్జీటీ తెలుగు మీడి యం పోస్టులు, 5 ఎస్ఏ గణితం పోస్టుల ఎంపికలో అవకతవకలు జరిగాయి. అప్పట్లో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ విచారణ జరిపి, నివేదికను విద్యాశాఖకు సమర్పించారు. అక్రమాలు నిజమేనని తేలడంతో 63 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు.

**నివేదికను మార్చాలంటూ ఒత్తిళ్లు**

డీఎస్సీ-2002లో జరిగిన అక్రమాలపై జిల్లాలో ఐదుగురు అధికారులతో కమిటీ నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ఇటీవలే విద్యాశాఖకు చేరింది. డైరెక్టరేట్‌లో శిష్యులైన ఉన్నతాధికారులు గురుభక్తిని ప్రదర్శించి నివేదిక బయటికి రాకుండా అడ్డుకున్నట్టు సమాచారం. అప్పట్లో ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసిన ఒక అధికారి.. విద్యాశాఖ డైరెక్టరేట్‌లో కీలకం గా వ్యవహరించారు. సదరు అధికారి అన్నీ తానై వ్యవహరించారు. ఆయన శిష్యులే ఇప్పు డు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో కీలకంగా ఉన్నారు. దీంతో గురుభక్తితో ఆ నివేదికను తొక్కిపెట్టినట్టు, నివేదికను మార్చి రాయాలని ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇంతకంటే దారుణం ఉంటుందా?**

తమకు జరిగిన అన్యాయంపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. 2024 ఏప్రిల్‌లో అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 22 ఏండ్ల సుదీర్ఘ పోరా టం తర్వాత ఉద్యోగాలొస్తాయని అభ్యర్థులు ఆశగా ఎదురుచూశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి ఏడాది అవుతున్నది. కానీ, ఇంకా ఉద్యోగాలివ్వలేదు. దీనిపై కరీంనగర్ జిల్లా నుంచి నివేదిక అందలేదంటూ మెలికపెట్టారు. జిల్లా అధికారుల నుంచి నివేదిక అందిన తర్వాత తొక్కిపెట్టడమే కాకుండా మార్చి రాయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఒక అధికారి నివేదికను తయారుచేసిన అధికారిని చీవాట్లు పెట్టిన ట్టు తెలిసింది. ఇంత వివరంగా ఎవరు రాయమన్నారు అంటూ ఫైర్ అయినట్టు వార్తలొస్తున్నాయి. కోర్టు తీర్పునిచ్చినా ఉద్యోగ నియామకాలు ఆలస్యం కావడం తో కొందరు అభ్యర్థులు విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని ఒక ఉద్యోగిని సంప్రదించగా, రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఉద్యోగాలిస్తామని బేరం పెట్టినట్టు ఆరోపిస్తున్నారు.

# బస్తీల్లో గుప్పుమంటున్న గంజాయి.. ఎమ్మెల్యేకు మహిళల ఫిర్యాదు

సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : ఫిలింనగర్ బస్తీల్లో ఎక్కడ చూసినా గంజాయి మత్తులో యువకులు మునిగిపోతున్నారు. దీన్ దయాళ్‌నగర్ బస్తీలోని ఆలయ పరిసరాల్లో పగలురాత్రీ అనే తేడా లేకుండా మందుబాబులు తిష్టవేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానిక మహిళలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను చుట్టుముట్టి తమ గోడును వెల్లబోసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్‌కు వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పెద్ద సంఖ్యలో మహిళలు చుట్టుముట్టారు. తమ బస్తీలో తాగుబోతుల బెడద ఎక్కువైందని, గుడిలోనే మద్యం తాగుతూ వచ్చీపోయేవారిని వేధిస్తున్నారంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పెట్రోలింగ్ పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, మీకు ఓట్లు వేసి గెలిపించినందుకు మీరైనా పట్టించుకోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు కాల్ చేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ పోలీసుల పనితీరుపై జనం నిలదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతుంటే మీరేం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.



## షాప్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు



సత్యమేవజయతేబినారాయణఖేడ్‌కల్హేర్ మండలం(బిబిపేట్) జమ్లా తండకు చెందిన వీరమని పోచపూర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మెకానిక్ షాపును ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ జెడ్పిటిసి దేవదాస్, కృష్ణమూర్తి నాయకులు గోవింద్, వకీల్, అఖిల్, భీమ్లా నాయక్, పండరి నాయక్, పండరీ పటేల్, దత్తు కురుమ తదితరులు ఉన్నారు.

## వికారాబాద్ నియోజకవర్గ మరియు జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్..





సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. ఆదివారం

శ్రీరామనవమి సందర్భంగా దారూర్ మండలం కేరెల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం లో మరియు వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డి పేట్ లోని మల్లికార్జున స్వామి ఆలయం లో జరిగిన శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవ వేడుక లో పాల్గొన్న వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ అందరూ దేవుని దయతో చల్లగా ఉండాలని కోరారు

ఈ సందర్భంగా ఆయన భక్తకోటి ప్రజలందరూ శ్రీ సీతారాముల కృపకటాక్షాలు పొందాలని కోరుకుంటూ.... వికారాబాద్ నియోజకవర్గ మరియు జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు అశోక్ , గ్రామస్తులు, మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



సత్యమేవ జయతే/హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని దేవులపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నాగప్రభ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న ఆవిర్భవించి నేటితో 45 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ మెజారిటీతో గెలిచి తెలంగాణ లో ప్రభుత్వాన్ని ఏర్పరచడం జరుగుతుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఎందుకంటే కేంద్రంలో నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అనేక సంక్షేమ పథకాలను ఆకర్షితులై యువత పెద్ద మొత్తంలో బిజెపి వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నాగరాజు గౌడ్,మురళి, తదితరులు పాల్గొన్నారు

## బిజెపితోనే. బలహీన వర్గాల అభివృద్ధి.

### బిజెపి ఎస్సీ సెల్ మోర్చా రాష్ట్ర కార్య దర్శి.. పెద్దిటి నవీన్ కుమార్..



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా మర్పల్లి లో జెండా ఆవిష్కరిచారు పెద్ద బడుగు బలహీన వర్గాల లకు మేలు జరుగుతుంది అన్నారు ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల భాగంగా మర్పల్లి మండల కేంద్రంలో మండల బిజెపి అధ్యక్షుడు రమేశ్వర్ రెడ్డి తో కలిసి జెండా ఆవిష్కరించారు ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ రాముని సన్నిధిలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి..



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.. తాండూర్ శ్రీరామ నవమి సందర్భంగా తాండూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ హనుమాన్ దేవాలయం, వినాయక గుడి, సాయిపూర్ హనుమాన్ దేవాలయం, ఇందిరా నగర్ రాంమందిర్ లో జరిగిన "శ్రీ సీతారాముల కళ్యాణ" వేడుకల్లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ.. బిజెపి జిల్లా కార్యదర్శి బుస శ్రీకాంత్....





సత్యమేవ జయతే.. వికారాబాద్. జిల్లా.. బీజేపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ ఈరోజు 31 వ వార్డు లోని 154 155 161 బూతులకు సంబంధించిన పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్. నాయకులు జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ మాధవ రెడ్డి అదేవిధంగా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి రాష్ట్ర నాయకులు కేపీ రాజు టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ పోకల సతీష్ సీనియర్ నాయకులు రాత శ్రీనివాస్ రెడ్డి పట్టణ అధ్యక్షులు శిరీష బీజేవైఎం అధ్యక్షులు చరణ్ రెడ్డి ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కమిటీ శ్రీనివాస్ ఉప్పు అమర్నాథ్ , ప్రసాద్ , మాణిక్ ప్రభు కన్నయ్య రఘురాం రెడ్డి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు కేసీఆర్ శ్రీరామ నవమి శుభాకాంక్షలు



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు, సీతాదేవి సమాజానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. తెలంగాణ ప్రజలకు శ్రీరాముడి ఆశీస్సులు ఉండాలని, శాంతి, సంతోషాలు, సామరస్యాలు, సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీరాముడి త్యాగాలను కొనియాడారు. శ్రీరాముడు ఎంతో పవిత్రమైన జీవితాన్ని గడిపారని, భారతీయ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచారని తెలిపారు. వైవాహిక విలువలను నిలబెట్టడంలో, సమాజ శ్రేయస్సు కోసం త్యాగం చేయడంలో ఈ జంటను ఆదర్శప్రాయమన్నారు.

## మేడ్చల్ జిల్లాలో 300 కిలోల గంజాయి పట్టివేత



సత్యమేవ జయతే - మేడ్చల్ మేడ్చల్ : ఇతర ప్రాంతాల నుండి నగరానికి భారీ మొత్తంలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి తరలిస్తున్నారని పక్క సమాచారం అందడంతో రంగంలోకి దిగిన ఎస్వోటి, శామీర్‌పేట్ పోలీసులు శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద ఆదివారం తెల్లవారు జామున సుమారు 300 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గంజాయితో పాటు తరలిస్తున్నవారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలను సాయంత్రం ప్రెస్ మీట్‌లో వెల్లడించనున్నట్లు సీఐ శ్రీనాథ్ తెలిపారు.

# లక్ష టన్నుల బియ్యానికి లాస్ 150 కోట్లు! - ఎగుమతితో చేతులు కాల్చుకుంటున్న

**లక్ష టన్నుల బియ్యానికి లాస్ 150 కోట్లు!**

**- ఎగుమతితో చేతులు కాల్చుకుంటున్న సర్కార్**

**- 8 లక్షల టన్నులకు ఒప్పందం**

**- ఎఫ్‌సీఐ చెల్లించేది కిలోకు రూ.40**

**- ఫిలిప్పీన్స్ ఇస్తున్నది 36 మాత్రమే**

**- నూకలు, రవాణా ఖర్చులు కలిపి రూ.10 వరకు సర్కారే భరించాలి**

**- అంటే ఎగుమతి ధర 26 మాత్రమే**

**- అంటే కిలోకు రూ.14 వరకు నష్టం**



- అయినా ఎగుమతి.. ఎవరి కోసం?

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : ఏదైనా పని వల్ల నష్టం జరుగుతుందని తెలిస్తే ఎవరూ ఆ పని చేయరు. కానీ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ తీరు మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధం. ధాన్యం వేలం ద్వారా ఇప్పటికే రూ.వేల కోట్లు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన ఆ శాఖ.. తాజాగా ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడం ద్వారా మరో భారీ నష్టాన్ని మూటగట్టుకోబోతున్నది. చేతులు కాల దం ఖాయమని తెలిసి కూడా ఈ విషయంలో ముందుకు పోతుండటం, పైగా ఇదేదో గొప్ప పని చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం పలు అనుమానాలకు, విమర్శలకు తావిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలిప్పీన్స్‌కు 8 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఒప్పందం చేసుకున్నది. ఇందులో భాగంగా తొలిదశలో లక్ష టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందాలు పూర్తయ్యాయి. దీంతో గత నెల 31న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాకినాడ రేవులో జెండా ఊపి 12,500 టన్నుల బియ్యం ఎగుమతిని ప్రారంభించారు. దీంతో ఎక్కువ ధర ఇచ్చే ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా తక్కువ ధరతో ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. రేషన్ బియ్యం కోసం కిలోకు రూ.40 ఖర్చు చేస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు.

ఈ లెక్కన మన రాష్ట్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిస్తే కేజీకి రూ.40 చొప్పున చెల్లిస్తుంది. కానీ, ఇప్పుడు పౌరసరఫరాల శాఖ కేజీ బియ్యం రూ.36 చొప్పున ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేస్తున్నది. ఇది ఎఫ్‌సీఐ ఇచ్చే ధర కంటే రూ.4 తక్కువ. ఎఫ్‌సీఐకి 25% నూకతో దొడ్డు బియ్యం ఇచ్చినా ఇబ్బంది ఉండదు. కానీ, ఒప్పందం ప్రకారం ఫిలిప్పీన్స్‌కు కేవలం 5% నూకతో నాణ్యమైన బియ్యాన్ని ఎగుమతి చేయాలి. ఈ క్రమంలో నూకను 25 నుంచి 5 శాతానికి తగ్గించేందుకు పౌరసరఫరాల శాఖ కేజీకి రూ.3 చొప్పున మిల్లర్లకు నష్టపరిహారం చెల్లిస్తున్నది. దీనితోపాటు మిల్లుల నుంచి కాకినాడ పోర్టు వరకు రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులన్నీ పౌరసరఫరాల శాఖే భరించాల్సి ఉంటుంది.

అందుకోసం కేజీకి రూ.2-3 వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ లెక్కన ఆ శాఖపై కేజీకి రూ.6 వరకు అదనపు భారం పడుతుంది. దీంతో ఎఫ్‌సీఐ ధరతో పోల్చితే కలిగే నష్టం రూ.4, అదనపు నష్టం రూ.6 కలిపి కేజీపై రూ.10 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఫిలిప్పీన్స్ చెల్లించే రూ.36 నుంచి ఈ నష్టాన్ని తీసేస్తే కేజీ ధర రూ.26 మాత్రమే. అంటే ఎఫ్‌సీఐ ధరతో పోల్చితే ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడం వల్ల కేజీకి రూ.14 చొప్పున నష్టం సంభవిస్తుంది. ఈ లెక్కన క్వింటాలుకు రూ.1,400, టన్నుకు రూ.14 వేలు, తొలిదశలో ఎగుమతి చేసే లక్ష టన్నులకు రూ.140 కోట్ల నష్టం వాటిల్లుతుంది. దీనికి ఇతర ఖర్చులను కూడా కలిపితే నష్టం రూ.150 కోట్ల వరకు పెరుగుతుందని స్వయంగా పౌరసరఫరాల శాఖ అధికారులే స్పష్టం చేస్తున్నారు.

ఎగుమతి వెనుక 'హస్తం' ఎవరిది?

ఇంత నష్టమని తెలిసినప్పటికీ బియ్యం ఎగుమతి నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం ఎగుమతికి సంబంధించిన కనీస వివరాలను ప్రభుత్వం, అధికారులు వెల్లడించకపోవడం మరిన్ని అనుమానాలను రేపుతున్నది. అసలు ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా తక్కువ ధరతో ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయాల్సిన అవసరం ఏమొచ్చింది, దీని వెనుక ఎవరి 'హస్తం' ఉందన్న ప్రశ్నలు అందరినీ తొలిచేస్తున్నాయి.

ఇప్పటికే తన వద్ద ఉన్న 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం ద్వారా విక్రయించిన పౌరసరఫరాల శాఖ.. ఇప్పుడు ఎగుమతి కోసం ఎక్కడి నుంచి బియ్యం సేకరిస్తున్నది? ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో కోత పెడుతున్నదా? అదే జరిగితే ఎక్కువ ధర చెల్లించే ఎఫ్‌సీఐని కాదని తక్కువ ధర వచ్చే ఫిలిప్పీన్స్ వెంట ఎందుకు పరుగులు పెడుతున్నట్టు? వేలం వేసిన ధాన్యాన్ని బిడ్డర్లు ఎత్తకపోతే ఆ ధాన్యాన్నే మిల్లింగ్ చేసి ఎగుమతి చేస్తున్నదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే కచ్చితంగా బిడ్డర్లకు మేలు చేయడమే అవుతుందని, నిబంధనల ప్రకారం ధాన్యం ఎత్తకుండా, పౌరసరఫరాల సంస్థకు డబ్బులు చెల్లించని బిడ్డర్లపై చర్యలు చేపట్టకుండా వారికి ఉపశమనం కలిగించేలా ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎగమతి చేయడం తప్పనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ ఎగుమతి వెనుక ఏదో తతంగం నడుస్తున్నదని, దీని వెనుక ఏపీకి చెందిన ఓ బడా మిల్లర్, ఎగుమతి వ్యాపారి ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

## కార్మికోద్యమ నాయకుడు కార్మికుల పక్షపాతి బీటీ రణదివే ఆశయాలను ముందుకు తీసుకెళ్లదాం 35వ వర్ధంతి సిపిఎం



కార్మికోద్యమ నాయకుడు కార్మికుల పక్షపాతి బీటీ రణదివే ఆశయాలను ముందుకు తీసుకెళ్లదాం 35వ వర్ధంతి సిపిఎం పిలుపు.జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్.. సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..

కార్మిక వర్గ ఐక్యత కోసం నిరంతరం కృషిచేసి కార్మిక హక్కుల కోసం పోరాడిన కార్మికోద్యమ నాయకుడు బీటీ రణధీవే గారి ఆశయాలను ముందుకు తీసుకెళదామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్,కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు ఆదివారం బీటీ రణదివే 35 వ వర్ధంతి సందర్భంగా వికారాబాద్ ఆర్ ఆర్ బి గెస్ట్ హౌస్ లో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ బాలచంద్ర త్రయాంబిక రణదీవే 1970లో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షునిగా పనిచేసి దేశంలో కార్మిక వర్గ పోరాటాలను విస్తరించారని అన్నారు నిరంతర అధ్యయన శీలీగా ఉంటూ కేంద్ర పాలకులు తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యతపరిచి నిరంతరం కార్మిక హక్కుల కోసం పోరాడారని తెలిపారు జౌళి,అఖిల భారత కార్మికుల రైల్వే సమ్మె వంటి అనేక సందర్భాలలో పాలకులు కార్మిక వర్గ పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్మిక వర్గాన్ని ఐక్యంగా ఉంచి సమ్మెలను జయప్రదం చేసి కార్మిక వర్గ హక్కులను కాపాడారని కొనియాడారు జౌళి కార్మికుల సమ్మె సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొని బీటీ రణదివే గారి పోరాటానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా నిరంతరం సమాజాన్ని కార్మిక వర్గాన్ని అధ్యయనం చేస్తూ కార్మిక వర్గానికి రాజకీయ విషయాలు బోధించేవారని అన్నారు బీటీ రణదివే 1979లో శ్రామిక మహిళ మొట్టమొదటి సమావేశం చెన్నైలో జరిపి మహిళా హక్కుల కోసం కూడా నినదించారని అన్నారు కామ్రేడ్ బీటీ రణదివే గారి స్ఫూర్తి తో కార్మిక వర్గం ఐక్యంగా ఉండి కార్మిక వర్గానికి వ్యతిరేకమైన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా శ్రామిక మహిళా కార్మికులకు అండగా పోరాడాలని పిలుపు ఇచ్చారు.నేడు ఈ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు కార్మికుల హక్కులను కలుస్తున్నారు.కనీస వేతనాలు అమలు చెయ్యడంలో పూర్తిగా విఫలం చెందారు. భావిషతులో కార్మికుల హక్కులను హరించే పాలకులను బొంద పెట్టాలన్నారు అందుకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ యాదయ్య శ్రీను,రాములు, మహేందర్, సత్యాయా తదితరులు పాల్గొన్నారు

## ఒక్క ఏడాదిలోనే ట్రంప్ ఆస్తి డబుల్..! ఇది ఎలా సాధ్యమైందంటే..?



2024లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న డొనాల్డ్ ట్రంప్, 2025 ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో 5.1 బిలియన్ డాలర్ల నికర విలువతో 700వ స్థానంలో నిలిచారు. క్రిప్టోకరెన్సీ వెంచర్లు, ట్రూత్ సోషల్ వంటి వ్యాపారాల ద్వారా ఆయన తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. న్యూయార్క్ కోర్టు ఆదేశాలను ఎదుర్కొన్నప్పటికీ, ట్రంప్ తన ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడంలో విజయం సాధించారు.%ఇశీఖ్రీస ఎతీబఎజూ%: ఒక్క ఏడాదిలోనే ట్రంప్ ఆస్తి డబుల్..! ఇది ఎలా సాధ్యమైందంటే..?ఏడాది క్రితం అనేక చట్టపరమైన కేసులను ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో 5.1 బిలియన్ డాలర్ల నికర విలువతో 700వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆయనతో పాటు మరికొంత మంది కూడా అంతే ఆస్తులతో 700వ స్థానంలో ఉన్నారు. అయితే పన్నెండు నెలల క్రితం ట్రంప్‌కు ఇంత సంపద లేదు. ఫోర్బ్స్ ప్రకారం, గత 12 నెలల్లో ఆయన తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. 2024లో ట్రంప్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్పుల కోసం తన ఆస్తుల నికర విలువను పెంచి చూపించారంటూ ఆయన ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్ ఆస్తుల జప్తు కూడా ఆదేశించింది. అందులో ఆయన ఐకానిక్ 40 వాల్ స్ట్రీట్ భవనం కూడా ఉంది. దీంతో ట్రంప్ ఆర్థిక భవిష్యత్తు అనిశ్చితంగా అనిపించింది. కానీ ట్రంప్ ప్రతిఘటించారు.ఆస్తుల జప్తును నివారించడానికి అవసరమైన బాండ్ మొత్తాన్ని 454 మిలియన్ డాలర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకు తగ్గించే విధంగా అతని న్యాయ బృందం కోర్టును ఒప్పించింది. తద్వారా పరిస్థితులను మార్చుకోవడానికి ట్రంప్‌కు సమయం దొరికింది. వెంటనే ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, ట్రూత్ సోషల్ మాతృ సంస్థను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గణనీయమైన నష్టాలు ఉన్నప్పటికీ, పేర్ విలువ పెరిగింది. స్టాక్ 72 శాతం క్షీణించినప్పటికీ, మార్చి 2025 నాటికి ట్రంప్ ఇప్పటికీ 2.6 బిలియన్ డాలర్ల వాటాను కలిగి ఉన్నారు. ఇది ఆయన సంపద పెరుగుదలకు దోహదపడింది. అలాగే 2024 అక్టోబర్‌లో ట్రంప్ వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ అనే క్రిప్టో ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఇది అనుభవం లేని పెట్టుబడిదారులను లక్ష్యంగా చేసుకుంది. ప్రారంభంలో అస్పష్టంగా ఉన్నప్పటికీ, ట్రంప్ అధ్యక్ష ఎన్నికల విజయం తర్వాత క్రిప్టో వ్యవస్థాపకుడు జస్టిన్ సన్ నుండి వచ్చిన హైప్‌తో ఈ ప్రాజెక్ట్ విలువ పెరిగింది.ఈ వెంచర్ చివరికి ట్రంప్ సంపదకు 245 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని జోడించింది. ట్రంప్ అక్కడితో ఆగలేదు. డిజిటల్ టోకెన్ %మి=ఖఫీ%ని ఆయన ఆవిష్కరించారు. ఇది సూపర్ సక్సెస్ అయింది. 350 మిలియన్ డాలర్లు ఆర్జించింది. 2024 చివరి నాటికి, ట్రంప్ క్రిప్టోకరెన్సీ వెంచర్లు అతనికి దాదాపు 800 మిలియన్ డాలర్ల ఆదాయం అందించినట్లు అంచనా. దీనితో ట్రంప్ క్రిప్టో కింగ్‌గా మారారు. ఇలా ట్రంప్ తన వ్యాపార తెలివి తేటలతో ఏడాదిలో తన సంపదను రెట్టింపు చేసుకున్నారు. ఫోర్బ్స్ 2025 బిలియనీర్ల జాబితాలో రికార్డు స్థాయిలో 3,028 మంది బిలియనీర్లు ఉన్నారు. వీరి మొత్తం నికర విలువ 16.1 ట్రిలియన్ డాలర్లు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు, ఆయన సన్నిహిత సలహాదారు ఎలోన్ మస్క్ తో పోలిస్తే ట్రంప్ సంపద ఇప్పటికీ చాలా తక్కువ. 342 బిలియన్ డాలర్ల సంపదతో మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలులో ఉందా ??
సత్యమేవ జయతే - సంగారెడ్డి
సంగారెడ్డి : ఆర్టిఐ
ఆర్టిఐ సంబద్ధ అంశాలు
1.1 సమాచార హక్కు -2005 యొక్క హక్కుల లక్షణాలు
15-06-2005 న పార్లమెంట్ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది.
సెక్షన్ 4, సబ్ సెక్షన్ (1) మరియు (2) సెక్షన్ 5, సెక్షన్ 12,13,15,16,24,27 మరియు 28 యొక్క సబ్ సెక్షన్ (1)
ఒకేసారి అమల్లోకి రావాల్సి ఉంటుంది మరియు మిగిలిన నిబంధనలు దాని అమలులో 120 వ రోజు అమలులోకి వస్తాయి.
ప్రతి ప్రజా అధికారం యొక్క పారదర్శకత మరియు జవాబుదారీతనంను ప్రోత్సహించడానికి.
ప్రభుత్వం యొక్క సమర్థవంతమైన పనితీరును పెంచేందుకు
పరిమిత ఆర్థిక వనరుల యొక్క ఉత్తమ వినియోగం
సున్నితమైన సమాచారాన్ని పరిరక్షించడం మరియు గోప్యత
1.2 కాన్సెప్ట్
పౌరులకు సమాచారం యొక్క హక్కు యొక్క ఆచరణాత్మక పాలనను ఏర్పాటు చేయడానికి.
ప్రజా అధికారుల నియంత్రణలో ఉన్న సమాచారానికి ప్రాప్యతను పొందడానికి.
ప్రతి ప్రభుత్వ అధికారం యొక్క పనిలో పారదర్శకత మరియు జవాబుదారీతనం ప్రోత్సహించడానికి
1.3 సమాచారం అంటే
రికార్డులు, పత్రాలు, జ్ఞాపికలు, ఇ-మెయిల్లు, అభిప్రాయాలు, సలహాలు, ప్రెస్ విడుదలలు, సర్క్యులర్లు, ఆదేశాలు,
లాగ్ బుక్స్, కాంట్రాక్ట్స్, రిపోర్ట్స్, పేపర్లు, నమూనాలు, మోడల్స్, డేటా, మెటీరియల్ మొదలైనవి.
ఏ ఇతర ఎలక్ట్రానిక్ రూపంలో అయినా, ఏదైనా ప్రైవేట్ సంస్థకు సంబంధించి ఏదైనా ప్రభుత్వ అధికారం ద్వారా ప్రాప్తి చేయగల సమాచారం
చట్టం అమలులో ఉన్న సమయం.
1.4 రికార్డ్ మీన్స్
ఏ డాక్యుమెంట్, మాన్యుస్క్రిప్ట్ ఫైల్
పత్రం యొక్క ఏదైనా సూక్ష్మచిత్రం మరియు ప్రతిరూపం నకలు.
అలాంటి మైక్రో ఫిల్మ్ లో చిత్రీకరించిన ఇమేజ్ లేదా చిత్రాల పునరుత్పత్తి
ఒక కంప్యూటర్ లేదా ఏదైనా ఇతర పరికరాన్ని ఉత్పత్తి చేసే ఇతర వస్తువు
1.5 పబ్లిక్ అథారిటీ ఎవరు?
ఏ అధికారం లేదా శరీరం లేదా సంస్థ స్వీయ-ప్రభుత్వం ఏర్పాటు లేదా ఏర్పాటు చేయబడింది
రాజ్యాంగం ద్వారా లేదా కింద.
పార్లమెంటు చేసిన ఏదైనా ఇతర చట్టం ద్వారా
రాష్ట్ర శాసనసభ చేసిన ఇతర చట్టాల ద్వారా.
నోటిఫికేషన్ జారీచేసిన లేదా ప్రభుత్వం చేత చేయబడిన ఉత్తర్వు ద్వారా మరియు ఏ బాడీ యాజమాన్యం, నియంత్రిత లేదా గణనీయంగా ఆర్థిక సహాయం చేయబడినది
ప్రభుత్వేతర సంస్థ ప్రభుత్వం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిధులు సమకూర్చింది
1.6 సమాచార హక్కు ఏమిటి
ఏ ప్రజా అధికారం యొక్క నియంత్రణలో లేదా కింద జరుగుతుంది ఈ చట్టం కింద అందుబాటులో సమాచారం హక్కు మరియు కలిగి
హక్కుజి
రచనలు, పత్రాలు, రికార్డులు తనిఖీ
గమనికలు, సంగ్రహాలు లేదా పత్రాలు లేదా రికార్డుల సర్టిఫికేట్ కాపీలు తీసుకోవడం
విషయం యొక్క సర్టిఫికేట్ నమూనాలను తీసుకోవడం
డిస్కెట్లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్లను లేదా ఏవైనా వాటిలో సమాచారాన్ని పొందడం
ఇతర ఎలక్ట్రానిక్ మోడ్ లేదా అటువంటి సమాచారం కంప్యూటర్లో లేదా ఏవైనా నిల్వ చేయబడిన ప్రింట్ ఔట్స్ ద్వారా
ఇతర పరికరం
1.7 అనుమతులకు అప్లికేషన్ ఫీజు ఇన్ఫర్మేషన్ పొందడం అభ్యర్థన
సెక్షన్ 6 లోని ఉప విభాగం (1) కింద సమాచారాన్ని పొందాలనే ఒక అభ్యర్థన కూడి ఉంటుంది నగదు రూపంలో లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా బ్యాంకర్లు చెల్లించవలసిన చెక్కు ద్వారా అప్లికేషన్ రుసుము ద్వారా
అకౌంట్స్ ఆఫీసర్ లేదా పబ్లిక్ అథారిటీ యొక్క ఇతర అధికారమిచ్చిన అధికారి, సరైన రశీదుకు వ్యతిరేకంగా,
క్రింది రేట్లు వద్ద:
విలేజ్ స్థాయిలో పబ్లిక్ అధికారులకు సంబంధించి %-% ఫీజు లేదు
మండల స్థాయిలో ప్రభుత్వ అధికారుల విషయంలో %-% దరఖాస్తుకు 5 రూపాయలు
పైన పేర్కొన్న వాటి కంటే ఇతర ప్రభుత్వ అధికారుల విషయంలో %-% రూ .10 / %-% దరఖాస్తుకు
1.8 సమాచారం అందించడానికి రుసుము వసూలు
సబ్ సెక్షన్ (1) లేదా సబ్ సెక్షన్ క్రింద సమాచారం అందించడానికి
(5) సెక్షన్ 7, నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్లు తనిఖీ ద్వారా చెల్లించవలసిన, చెల్లించవలసిన
అకౌంట్స్ ఆఫీసర్ లేదా పబ్లిక్ అథారిటీ యొక్క ఇతర అధికారమిచ్చిన అధికారి, సరైన వ్యతిరేకంగా రసీదులు, క్రింది రేట్లు:
ప్రైస్డ్ మెటీరియల్: పబ్లికేషన్స్ ముద్రిత విషయం, టెక్స్ట్, పటాలు, ప్రణాళికలు, ఫ్లాపీలు, సిడి లు, నమూనాలు, నమూనాలు లేదా ఏదైనా ఇతర రూపంలో పదార్థం, ఇవి ధర, అమ్మకం ధర
దానిజి
ధర విషయంలో కాకుండా
ప్రింట్ లేదా టెక్స్ట్ రూపంలో మెటీరియల్ (ఎ4 లేదా ఎ3 సైజు కాగితం లో) రూపా.2 / %-% ప్రతి పేజీకి
కాపీనిజి
ఎ4 లేదా ఎ3 సైజు కాగితం కంటే పెద్దగా ముద్రిత లేదా టెక్స్ట్ రూపంలో ఉన్న పదార్థం %-% అసలు ధర
దానిజి
పటాలు మరియు ప్రణాళికలు %-% అసలు వ్యయం
ఎలెక్ట్రానిక్ ఫార్మాట్ లో సమాచారం, ఫ్లాపీ, సిడి లేదా డివిడి:
1.44 యంబి యొక్క ఫ్లాపీ కోసం రూపాయలు యాభై.
700 యంబి యొక్క సిడి కోసం వంద రూపాల రూపాయలు
సిడి కోసం రెండు వందల రూపాయలు
నమూనాలు మరియు మోడల్స్ %-% అసలు ధర దాని
రికార్డుల తనిఖీ %-% మొదటి గంటకు రుసుము లేదుబీ ఒక్కోదానికి రూ
తర్వాత పదిహేను నిమిషాలు (లేదా భిన్నం)
రికార్డుల తనిఖీ %-% మొదటి గంటకు రుసుము లేదుబీ ఒక్కోదానికి రూ
తర్వాత పదిహేను నిమిషాలు (లేదా భిన్నం)
పోస్ట్ ద్వారా పంపబడే మెటీరియల్ %-% ఛార్జ్ను చెల్లించే అదనపు చెల్లింపులతో సహా వాస్తవ పోస్టల్ ఛార్జీలు
ఈ నియమాలు
1.9 సంబంధిత లింకులు
ఆర్టీఐ, తెలంగాణ
ఆర్టిఐ, ప్రభుత్వం. భారతదేశం యొక్క
1.10 ఆర్టిఐ కేసులు
ఆర్టిఐ కేసులు
- తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలులో ఉందా ??
సంగారెడ్డి డిస్ట్రిక్ట్ లో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25% ఇవ్వాల్సినటువంటి ఉచిత విద్య ఎన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు ఆయా విద్యార్థుల వివరాలు ఇవ్వాలని మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు ఆర్టిఏ లో ఇవ్వడం జరిగింది. అలాగే డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కి ఆర్టిఏ ద్వారా అడగడం జరిగింది కానీ ఇప్పటివరకు ఏ అధికారి కూడా సమాచారం ఇప్పటివరకు ఇవ్వలేదు అయితే ఈ సమాచారాన్ని 2024లో అడగడం జరిగింది. 2025 సంవత్సరం ప్రారంభమై ఇప్పటికి మూడు నెలలు గడిచి నాలుగవ నెల ప్రారంభంలో ఉన్నప్పటికీ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కానీ లేదా డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కానీ స్పందించలేదు ఉన్నతాధికారులు స్పందించకపోతే మరి చట్టాలని దుర్వినియోగం చేస్తున్నట్టే కదా మరి చట్టాలని దుర్వినియోగం చేస్తున్న ఉన్నతాధికారులపై చర్యలు శూన్యంగానే ఉన్నాయి చట్టాలు అమలు చేయనప్పుడు చట్టాల రూపకల్పన ఎందుకు చేయాలి చట్టాలు రూపకల్పన చేసినప్పుడు అవి అమలులో పెట్టకపోతే అట్టి అధికారులని పదవుల్లో నుంచి తొలగించాలి కదా అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేట్ స్కూళ్లలో ఒక నోటీస్ బోర్డును ఏర్పాటుచేసి ఆ నోటీసు బోర్డుపై అక్కడ ఉన్నటువంటి టీచర్ల ఎడ్యుకేషన్ నోటీస్ బోర్డులో ఉంచాలని గతంలో సంగారెడ్డి డి ఈ ఓ గారికి ఇవ్వడం జరిగింది కానీ ఇప్పటివరకు ఏ ప్రైవేట్ స్కూల్లో నోటీసు బోర్డు పెట్టలేదు కదా దాని ఊసు కూడా లేదు అలాగే డీఈఓ గారు ఇలా నోటీస్ బోర్డ్ పెట్టించాలి దానిలో అక్కడ ఉన్నటువంటి టీచర్ల సర్టిఫికెట్లని ఉంచాలి అని చెప్పి డిఇఓ గారికి చెప్పినప్పుడు డిఇఓ గారు ఇలాంటి ఆర్టిఏ లో చాలానే చూసాము వీటివల్ల ఏమవుతది వీటిని ఎవరు పట్టించుకుంటారు అనే విధంగా మాట్లాడారు అలాగే మేము అడిగిన సమాచారాన్ని ఇప్పటివరకు ఇవ్వకపోగా ఏ చర్యలు కూడా ప్రైవేట్ స్కూల్ ల పైన తీసుకోలేదు కాబట్టి ఆర్టిఏ చట్టాలను అమలు పరచకపోతే అమలుపరచని ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం.

# కమనీయం... శ్రీ సీతారాముల కళ్యాణం






**ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దంపతులు**

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి దంపతులు**

**కిటకిటలాడిన కోదండ రామాలయం**

**రామనామ స్మరణతో మార్మోగిన దేవాలయాలు**



సత్యమేవ జయతే:మెదక్ శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం మెదక్ జిల్లాలో కనులపండువగా సాగాయి. బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. జగదభిరాముడి కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి దంపతులు సైతం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్య లో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం మందుగా సేవపై స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఎదుర్కొని వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీటలపై ప్రతిష్టింపజేశారు. ముందుగా విశ్వక్సేనారాధన నిర్వహించి కల్యాణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగింపజేయాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు రక్షాబంధనాలను సీతా అమ్మవారి, రాముల వారి ముంజేతికి అలంకరింపజేశారు. సుముహూర్తం ప్రారంభం కాగానే ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదన్ చార్యులు అమ్మవారి, స్వామివారి తలలపై జీలకర్రబెల్లం అలంకరించారు. మంగళసూత్రాన్ని భక్తులకు దర్శింపజేసి రాములవారి చేతులకు తాకించి సీతాదేవి మెడలో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు జయజయధ్వానాలు పలికారు. చివరగా తలంబ్రాలను సీతారాముల తలలపై ఉంచి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ముగింపజేశారు. అనంతరం భక్తులు స్వామి వారి దర్శించుకున్నారు. భజన గేయాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి జగపతి, తొడుపునూరి చంద్రపాల్, మల్లికార్జున్ గౌడ్,
ఆలయ కమిటి చైర్మన్ బండ నరేందర్, సభ్యులు బాల్ రాజ్, పురుషోత్తం, బద్రినాథ్, నందిని శ్రీనివాస్, మల్లేశం, సకిలం శ్రీను, దేవేందర్ రెడ్డి, వేద పండితులు అభిలాష్ శర్మ, సాయిబాబా, కృష్ణ మూర్తి, శ్రీనివాస్ చారి,ఆయా పార్టీల నేతలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# సీతా మాత అగ్నిప్రవేశం చేసింది ఎక్కడో తెలుసా..?

## సత్యమేవ జయతే - జీవిత కథలు



సీతా మాత అగ్నిప్రవేశం చేసింది ఎక్కడో తెలుసా..?
సత్యమేవ జయతే - జీవిత కథలు
రామాయణం అద్భుతమైన దృశ్య కావ్యం. కొందరు ఇది కేవలం పురాణమేనని.. నిజంగా జరిగింది కాదని వాదిస్తుంటారు. అయితే, పుక్కిటి పురాణం కాదని.. యథార్థమేనని హిందువులు నమ్మకం. భారతదేశంలో ఎక్కడ చూసినా పలు చోట్ల శ్రీరాముడికి సంబంధించిన ఆలయాలయాలతో పాటు త్రేతాయుగం నాటికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. ఆ ప్రాంతాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయితే, ఇందులో ఓ అరుదైన ప్రాంతం సైతం ఉన్నది. అదే జానకీమాత పుట్టిన స్థలం సీతామర్హి. సీతమ్మ వారు భూదేవికి ప్రతిరూపం. ఇంద్రుడి ప్రసన్నం చేసుకునే క్రతువులో భాగంగా జనకమహారాజు.. నాగలితో దున్నుతున్నప్పుడు ఒక పెట్టె అడ్డు తగిలిందని.. అందులోనే సీతమ్మ వారు ఉన్నట్లుగా రామాయణం చెబుతున్నది. అయితే, సీతమ్మ వారు జనకమహారాజుకు దొరికింది సీతామర్హిలోనేనని స్థానికులు పేర్కొంటారు. ఈ సీతామర్హి బిహార్ రాష్ట్రంలో ఉన్నది. ఇందుకు అనుగుణంగా ఎక్కడ ఎన్నో కట్టడాలు సైతం చూడొచ్చు. జానకీమాత దొరికిన చోట జనకమహారాజు ఓ పెద్ద చెరువును తవ్వించడాని.. వివాహ సందర్భంగా సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఆయనే స్వయంగా స్థాపించారని స్థల పురాణం చెబుతున్నది. ఇందుకే ఈ ప్రదేశాన్ని జానకీ కుండ్‌గా పిలుస్తుంటారు. ఆ సీతామర్హిలోనే సీతమ్మ జననానికి గుర్తుగా భవ్యమైన జానకీ మందిరం సైతం కనిపిస్తుంది. కాలక్రమేనా ఈ ప్రదేశమంతా అటవీ ప్రాంతంలా మారిందని.. ఈ సమయంలోనే బీర్బల్ దాస్ అనే స్వామీజీకి సీతామర్హి గురించి దివ్యదర్శనం కలిగిందని.. ఆయన పూనికతో నాటి విశేషాలన్నీ మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చాయని స్థానికులు చెబుతుంటారు.

ఇక సీతామర్హికి మరో విశిష్టత సైతం ఉన్నది. రావణ సంహారం తర్వాత లంక నుంచి వచ్చిన సీతామాత స్వచ్ఛతను నిరూపించుకొమ్మని రాముడు ఆదేశిస్తాడు. దాంతో సీతామాత అగ్నిప్రవేశం చేస్తుంది. ఈ ఘట్టం జరిగింది కూడా సీతామర్హిలోనేని చెబుతుంటారు. దీనికి రుజువుగా ఇక్కడ వేడి నీటి బుగ్గలు దర్శనమిస్తాయి. సీతమ్మవారిని దహించలేకపోయిన అగ్ని, అక్కడి భూగర్భంలోని నీటిలోకి చేరి ఇలా ఉబికి వస్తోందని భక్తుల విశ్వాసం. మాఘపౌర్ణమి రోజున ఈ నీటి బుగ్గలో స్నానం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈ సీతామర్హికి వెళ్లాలంటే బిహార్‌లోని పాట్నా, ముజఫర్‌పూర్, దర్భంగా పట్టాల నుంచి చేరుకోవచ్చు. ఈ సీతామర్హి గురించి చాలామందికి తెలియదు. ఇప్పుడిప్పుడే సీతామర్హి గురించి తెలుస్తుండడంతో సందర్శించే వారి సంఖ్య పెరుగుతూ వస్తున్నది.

# తిరుమల శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

సత్యమేవ జయతే - తిరుమల
తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి ఆస్థానాన్ని పురస్కరించుకొని ఆలయంలోని రంగనాయకుల మండపంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు.
ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రములు, దివ్యప్రభంధములోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.
సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు హనుమంత



వాహనసేవ , రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. 7న శ్రీరామ పట్టాభిషేకాన్ని రాత్రి 8 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక ఆస్థానాన్ని నిర్వహించనున్నారని వెల్లడించారు.

## : సీతారాముల కల్యాణంకౌ%పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే



సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : చంపాపేట డివిజన్ పరిధిలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో, అదే విధంగా అంజిరెడ్డి కాలనీ పార్క్‌లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ లావణ్య పర్యవేక్షణలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కమల దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. భారీ ఊరేగింపు మధ్య స్వామి వారి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఎమ్మెల్యే దంపతులు కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే దంపతులు అంతకుముందు ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు వేదపండితులు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

## శ్రీరామ నవమి శోభాయాత్ర.. ఈ రూట్లలో రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఆంక్షలు



సత్యమేవ జయతే - హైదరాబాద్

హైదరాబాద్ : శ్రీరామ నవమి శోభయాత్ర సందర్భంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రాత్రి 9 గంటల వరకు సీతారాంబాగ్ ఆలయం నుంచి హనుమాన్ వ్యాయామశాల స్కూల్, సుల్తాన్‌బజార్ మీదుగా బోయిగూడ కమాన్, మంగల్‌హాట్ పీఎస్ రోడ్డు, జాలి హనుమాన్, ధూల్‌పేట, పురానాపూల్, గాంధీ విగ్రహం, జుమేరత్ బజార్, చుడీ బజార్, బేగంబజార్ ఛత్రి, బర్తన్ బజార్, ఎస్‌ఏ బజార్ మసీదు, శంకర్ షేర్ హోటల్, గౌలిగూడ కమాన్, రామమందిల్ కమాన్, పుత్లిబౌలి ఎక్స్ రోడ్, ఆంధ్రా బ్యాంక్ ఎక్స్‌రోడ్, డీఎం హెచ్ ఎక్స్ రోడ్, సుల్తాన్ బజార్ ఎక్స్ రోడ్, రాయల్ ప్లాజా టీ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా రూట్‌లలో వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా చారిత్రాత్మక సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ యాత్రను ప్రారంభిస్తారు. భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సాగే ఈ యాత్ర సీతారామ్‌బాగ్ నుంచి కోఠి హనుమాన్‌టేక్డీ వరకు కొనసాగుతుంది. ఇక ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో ధూల్‌పేట మాగ్రా నుంచి శ్రీరామ నవమి పాల్కి యాత్రను మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్సీ కవిత ప్రారంభిస్తారు. అదేవిధంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో మరో యాత్ర సాగుతుంది. ధూల్‌పేట గంగాబౌలి నుంచి కోఠి హనుమాన్ టెక్డీ వరకు సాగుతుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు యాత్రను రాజాసింగ్ ప్రారంభిస్తారు.

ఈ మూడు యాత్రలు మంగళ్‌హాట్ ప్రధాన రోడ్డులోని అనిత టవర్ వద్ద కలుస్తాయి. పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, చుడీబజార్, బేగంబజార్ ఛత్రి, సిద్ది అంబర్ బజార్, గౌలిగూడ, పుత్లీబౌలి మీదుగా కోఠీ హనుమాన్ టేక్డీ వరకు కొనసాగుతాయి. ఊరేగింపులో శ్రీరాముడితోపాటు పలు దేవుళ్ల విగ్రహాలుంటాయి.

ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో వాహనాలను ఇతర ప్రాంతాల మీదుగా పోలీసులు దారిమళ్లిస్తున్నారు. సీతారామ్‌బాగ్‌కు వచ్చే వాహనాలను మల్లేపల్లి, నాంపల్లి మీదుగా దారిమళ్లిస్తారు. బోయిగూడ కమాన్ నుంచి దారుసలాం ఆగాపురా మీదుగా, పురానాపూల్ నుంచి వాహనాలను జియాగూడ కార్వాన్ వైపు, బేగంబజార్ నుంచి వచ్చే వాహనాలను గోషామహల్, ఇతర ప్రాంతాలకు దారిమళ్లిస్తున్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలులో ఉందా ??






తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలులో ఉందా ??
సత్యమేవ జయతే - సంగారెడ్డి
సంగారెడ్డి : ఆర్టిఐ
ఆర్టిఐ సంబద్ధ అంశాలు
1.1 సమాచార హక్కు -2005 యొక్క హక్కుల లక్షణాలు
15-06-2005 న పార్లమెంట్ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది.
సెక్షన్ 4, సబ్ సెక్షన్ (1) మరియు (2) సెక్షన్ 5, సెక్షన్ 12,13,15,16,24,27 మరియు 28 యొక్క సబ్ సెక్షన్ (1)
ఒకేసారి అమల్లోకి రావాల్సి ఉంటుంది మరియు మిగిలిన నిబంధనలు దాని అమలులో 120 వ రోజు అమలులోకి వస్తాయి.
ప్రతి ప్రజా అధికారం యొక్క పారదర్శకత మరియు జవాబుదారీతనంను ప్రోత్సహించడానికి.
ప్రభుత్వం యొక్క సమర్థవంతమైన పనితీరును పెంచేందుకు
పరిమిత ఆర్థిక వనరుల యొక్క ఉత్తమ వినియోగం
సున్నితమైన సమాచారాన్ని పరిరక్షించడం మరియు గోప్యత
1.2 కాన్సెప్ట్
పౌరులకు సమాచారం యొక్క హక్కు యొక్క ఆచరణాత్మక పాలనను ఏర్పాటు చేయడానికి.
ప్రజా అధికారుల నియంత్రణలో ఉన్న సమాచారానికి ప్రాప్యతను పొందడానికి.
ప్రతి ప్రభుత్వ అధికారం యొక్క పనిలో పారదర్శకత మరియు జవాబుదారీతనం ప్రోత్సహించడానికి
1.3 సమాచారం అంటే
రికార్డులు, పత్రాలు, జ్ఞాపికలు, ఇ-మెయిల్లు, అభిప్రాయాలు, సలహాలు, ప్రెస్ విడుదలలు, సర్క్యులర్లు, ఆదేశాలు,
లాగ్ బుక్స్, కాంట్రాక్ట్స్, రిపోర్ట్స్, పేపర్లు, నమూనాలు, మోడల్స్, డేటా, మెటీరియల్ మొదలైనవి.
ఏ ఇతర ఎలక్ట్రానిక్ రూపంలో అయినా, ఏదైనా ప్రైవేట్ సంస్థకు సంబంధించి ఏదైనా ప్రభుత్వ అధికారం ద్వారా ప్రాప్తి చేయగల సమాచారం
చట్టం అమలులో ఉన్న సమయం.
1.4 రికార్డ్ మీన్స్
ఏ డాక్యుమెంట్, మాన్యుస్క్రిప్ట్ ఫైల్
పత్రం యొక్క ఏదైనా సూక్ష్మచిత్రం మరియు ప్రతిరూపం నకలు.
అలాంటి మైక్రో ఫిల్మ్ లో చిత్రీకరించిన ఇమేజ్ లేదా చిత్రాల పునరుత్పత్తి
ఒక కంప్యూటర్ లేదా ఏదైనా ఇతర పరికరాన్ని ఉత్పత్తి చేసే ఇతర వస్తువు
1.5 పబ్లిక్ అథారిటీ ఎవరు?
ఏ అధికారం లేదా శరీరం లేదా సంస్థ స్వీయ-ప్రభుత్వం ఏర్పాటు లేదా ఏర్పాటు చేయబడింది రాజ్యాంగం ద్వారా లేదా కింద.
పార్లమెంటు చేసిన ఏదైనా ఇతర చట్టం ద్వారా
రాష్ట్ర శాసనసభ చేసిన ఇతర చట్టాల ద్వారా.
నోటిఫికేషన్ జారీచేసిన లేదా ప్రభుత్వం చేత చేయబడిన ఉత్తర్వు ద్వారా మరియు ఏ బాడీ
యాజమాన్యం, నియంత్రిత లేదా గణనీయంగా ఆర్థిక సహాయం చేయబడినది
ప్రభుత్వేతర సంస్థ ప్రభుత్వం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిధులు సమకూర్చింది
1.6 సమాచార హక్కు ఏమిటి
ఏ ప్రజా అధికారం యొక్క నియంత్రణలో లేదా కింద జరుగుతుంది ఈ చట్టం కింద అందుబాటులో సమాచారం హక్కు మరియు కలిగి
హక్కుజి
రచనలు, పత్రాలు, రికార్డులు తనిఖీ
గమనికలు, సంగ్రహాలు లేదా పత్రాలు లేదా రికార్డుల సర్టిఫికేట్ కాపీలు తీసుకోవడం
విషయం యొక్క సర్టిఫికేట్ నమూనాలను తీసుకోవడం
డిస్కెట్లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్లను లేదా ఏవైనా వాటిలో సమాచారాన్ని పొందడం
ఇతర ఎలక్ట్రానిక్ మోడ్ లేదా అటువంటి సమాచారం కంప్యూటర్లో లేదా ఏవైనా నిల్వ చేయబడిన ప్రింట్ ఔట్స్ ద్వారా
ఇతర పరికరం
1.7 అనుమతులకు అప్లికేషన్ ఫీజు ఇన్ఫర్మేషన్ పొందడం అభ్యర్థన
సెక్షన్ 6 లోని ఉప విభాగం (1) కింద సమాచారాన్ని పొందాలనే ఒక అభ్యర్థన కూడి ఉంటుంది
నగదు రూపంలో లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా బ్యాంకర్లు చెల్లించవలసిన చెక్కు ద్వారా అప్లికేషన్
రుసుము ద్వారా
అకౌంట్స్ ఆఫీసర్ లేదా పబ్లిక్ అథారిటీ యొక్క ఇతర అధికారమిచ్చిన అధికారి, సరైన రశీదుకు వ్యతిరేకంగా,
క్రింది రేట్లు వద్ద:
విలేజ్ స్థాయిలో పబ్లిక్ అధికారులకు సంబంధించి %-% ఫీజు లేదు
మండల స్థాయిలో ప్రభుత్వ అధికారుల విషయంలో %-% దరఖాస్తుకు 5 రూపాయలు
పైన పేర్కొన్న వాటి కంటే ఇతర ప్రభుత్వ అధికారుల విషయంలో %-% రూ .10 / %-% దరఖాస్తుకు
1.8 సమాచారం అందించడానికి రుసుము వసూలు
సబ్ సెక్షన్ (1) లేదా సబ్ సెక్షన్ క్రింద సమాచారం అందించడానికి
(5) సెక్షన్ 7, నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్లు తనిఖీ ద్వారా చెల్లించవలసిన, చెల్లించవలసిన
అకౌంట్స్ ఆఫీసర్ లేదా పబ్లిక్ అథారిటీ యొక్క ఇతర అధికారమిచ్చిన అధికారి, సరైన వ్యతిరేకంగా రసీదులు, క్రింది రేట్లు:
ప్రైస్డ్ మెటీరియల్: పబ్లికేషన్స్ ముద్రిత విషయం, టెక్స్ట్, పటాలు, ప్రణాళికలు, ఫ్లాపీలు, సిడి లు, నమూనాలు, నమూనాలు లేదా ఏదైనా ఇతర రూపంలో పదార్థం, ఇవి ధర, అమ్మకం ధర దానిజి
ధర విషయంలో కాకుండా
ప్రింట్ లేదా టెక్స్ట్ రూపంలో మెటీరియల్ (ఎ4 లేదా ఎ3 సైజు కాగితం లో) రూపా.2 / %-% ప్రతి పేజీకి
కాపీనిజి
ఎ4 లేదా ఎ3 సైజు కాగితం కంటే పెద్దగా ముద్రిత లేదా టెక్స్ట్ రూపంలో ఉన్న పదార్థం %-% అసలు ధర
దానిజి
పటాలు మరియు ప్రణాళికలు %-% అసలు వ్యయం
ఎలెక్ట్రానిక్ ఫార్మాట్ లో సమాచారం, ఫ్లాపీ, సిడి లేదా డివిడి:
1.44 యంబి యొక్క ఫ్లాపీ కోసం రూపాయలు యాభై.
700 యంబి యొక్క సిడి కోసం వంద రూపాల రూపాయలు
సిడి కోసం రెండు వందల రూపాయలు
నమూనాలు మరియు మోడల్స్ %-% అసలు ధర దాని
రికార్డుల తనిఖీ %-% మొదటి గంటకు రుసుము లేదుబీ ఒక్కోదానికి రూ తర్వాత పదిహేను నిమిషాలు (లేదా భిన్నం)
రికార్డుల తనిఖీ %-% మొదటి గంటకు రుసుము లేదుబీ ఒక్కోదానికి రూ తర్వాత పదిహేను నిమిషాలు (లేదా భిన్నం)
పోస్ట్ ద్వారా పంపబడే మెటీరియల్ %-% ఛార్జ్కు చెల్లించే అదనపు చెల్లింపులతో సహా వాస్తవ పోస్టల్ ఛార్జీలు
ఈ నియమాలు
1.9 సంబంధిత లింకులు
ఆర్టీఐ, తెలంగాణ
ఆర్టిఐ, ప్రభుత్వం. భారతదేశం యొక్క
1.10 ఆర్టిఐ కేసులు
ఆర్టిఐ కసులు
- తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఐ చట్టం అమలులో ఉందా ??
సంగారెడ్డి డిస్ట్రిక్ట్ లో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25% ఇవ్వాల్సినటువంటి ఉచిత విద్య ఎన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు ఆయా విద్యార్థుల వివరాలు ఇవ్వాలని మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు ఆర్టిఏ లో ఇవ్వడం జరిగింది. అలాగే డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కి ఆర్టిఏ ద్వారా అడగడం జరిగింది కానీ ఇప్పటివరకు ఏ అధికారి కూడా సమాచారం ఇప్పటివరకు ఇవ్వలేదు అయితే ఈ సమాచారాన్ని 2024లో అడగడం జరిగింది. 2025 సంవత్సరం ప్రారంభమై ఇప్పటికి మూడు నెలలు గడిచి నాలుగవ నెల ప్రారంభంలో ఉన్నప్పటికీ మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కానీ లేదా డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కానీ స్పందించలేదు ఉన్నతాధికారులు స్పందించకపోతే మరి చట్టాలని దుర్వినియోగం చేస్తున్నట్టే కదా మరి చట్టాలని దుర్వినియోగం చేస్తున్న ఉన్నతాధికారులపై చర్యలు శూన్యంగానే ఉన్నాయి చట్టాలు అమలు చేయనప్పుడు చట్టాల రూపకల్పన ఎందుకు చేయాలి చట్టాలు రూపకల్పన చేసినప్పుడు అవి అమలులో పెట్టకపోతే అట్టి అధికారులని పదవుల్లో నుంచి తొలగించాలి కదా అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేట్ స్కూళ్లలో ఒక నోటీస్ బోర్డును ఏర్పాటుచేసి ఆ నోటీసు బోర్డుపై అక్కడ ఉన్నటువంటి టీచర్ల ఎడ్యుకేషన్ నోటీస్ బోర్డులో ఉంచాలని గతంలో సంగారెడ్డి డి ఈ ఓ గారికి ఇవ్వడం జరిగింది కానీ ఇప్పటివరకు ఏ ప్రైవేట్ స్కూల్లో నోటీసు బోర్డు పెట్టలేదు కదా దాని ఊసు కూడా లేదు అలాగే డీఈఓ గారు ఇలా నోటీస్ బోర్డ్ పెట్టించాలి దానిలో అక్కడ ఉన్నటువంటి టీచర్ల సర్టిఫికెట్లని ఉంచాలి అని చెప్పి డిఇఓ గారికి చెప్పినప్పుడు డిఇఓ గారు ఇలాంటి ఆర్టిఏ లో చాలానే చూసాము వీటివల్ల ఏమవుతది వీటిని ఎవరు పట్టించుకుంటారు అనే విధంగా మాట్లాడారు అలాగే మేము అడిగిన సమాచారాన్ని ఇప్పటివరకు ఇవ్వకపోగా ఏ చర్యలు కూడా ప్రైవేట్ స్కూల్ ల పైన తీసుకోలేదు కాబట్టి ఆర్టిఏ చట్టాలను అమలు పరచకపోతే అమలుపరచని ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం.
మీ మల్లేష్ గౌడ్
సంగారెడ్డి జిల్లా

## : చెరుకు రసాన్ని తరచూ తాగితే ఇన్ని లాభాలు ఉన్నాయా.. తరచూ తీసుకోవాల్సిందే..!



సత్యమేవ జయతే - ఆరోగ్య చిట్కాలు

వేసవి కాలంలో సహజంగానే చాలా మంది చల్లని మార్గాలను ఆశ్రయిస్తుంటారు. వేసవి తాపం నుంచి తట్టుకునేందుకు కొబ్బరి బొండాలు, శీతల పానీయాలు, చల్లని నీళ్లతోపాటు చెరుకు రసం కూడా ఎక్కువగానే తాగుతారు. చెరుకు రసాన్ని ఈ సీజన్‌లో సేవిస్తే ఎంతో రుచిగా ఉంటుంది. మండే ఎండల నుంచి ఉపశమనాన్ని అందించడంలో చెరుకు రసం ఎంతో మేలు చేస్తుంది. దీంట్లో శరీరానికి చలువ చేసే గుణాలు ఉంటాయి. అందువల్ల చెరుకు రసాన్ని సేవిస్తే శరీరం చల్లగా మారుతుంది. వేడి తగ్గిపోతుంది. వేసవి తాపం తగ్గుతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. 250 ఎంఎల్ చెరుకు రసాన్ని సేవిస్తే మనకు సుమారుగా 160 క్యాలరీల శక్తి లభిస్తుంది. అలాగే ఫైబర్, క్యాల్షియం, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్, విటమిన్ సి, విటమిన్ బి6, విటమిన్ ఇ ఇందులో సమృద్ధిగా ఉంటాయి.

శక్తికి, ఉత్సాహానికి..

వేసవి కాలంలో సహజంగానే మనకు నీరసం అధికంగా వస్తుంది. చిన్న పనిచేసినా చాలు త్వరగా అలసిపోతుంటారు. అలాగే ఉదయం లేవగానే నిస్సత్తువగా కూడా ఉంటుంది. ఏ పని చేయాలనిపించదు. బద్దకంగా ఉంటుంది. ఈ లక్షణాల నుంచి బయట పడాలంటే అందుకు చెరుకు రసం ఎంతో మేలు చేస్తుంది. ఈ రసాన్ని సేవిస్తే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. దీంతో ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఎంత పని చేసినా అలసట రాదు. చెరుకు రసంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. చెరుకు రసం తాగితే మలబద్దకం తగ్గుతుంది. పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. శరీరంలో పీహెచ్ స్థాయిలు సక్రమంగా నిర్వహించబడతాయి. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి.

కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

అధ్యయనాలు చెబుతున్న ప్రకారం చెరుకు రసాన్ని తరచూ సేవిస్తుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారికి చెరుకు రసం ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తాగితే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువును తగ్గించేందుకు సహాయం చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచడంలోనూ చెరుకు రసం అద్భుతంగా పనిచేస్తుంది. చెరుకు రసాన్ని సేవిస్తుంటే కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. కిడ్నీలు క్లీన్ అవుతాయి. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. మూత్రంలో మంట తగ్గిపోతుంది. మూత్రం సాఫీగా జారీ అవుతుంది.

చర్మ సంరక్షణకు..చెరుకు రసంలో ఫ్లేవనాయిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అలాగే ఈ రసంలో ఫినోలిక్ సమ్మేళనాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలు వయస్సు మీద పడడం ఆలస్యం అవుతుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. చర్మం సహజసిద్ధమైన నిగారింపును పొందుతుంది. గర్భంతో ఉన్న మహిళలు చెరుకు రసం సేవిస్తే ఎంతో మేలు జరుగుతుంది. చెరుకు రసంలో ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది గర్భంలోని పిండం ఎదుగుదలకు సహాయం చేస్తుంది. శిశువుకు పుట్టుక లోపాలు రాకుండా చూస్తుంది. ఇలా చెరుకు రసాన్ని తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి.

(నోట్ : ఇంటర్నెట్‌లో మరియు పుస్తకాల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు 'సత్యమేవ జయతే' బాధ్యత వహించదు.)

## దాల్చిన చెక్కతో ఇంటి చిట్కాలు.. ఏయే అనారోగ్యాలకు దీన్ని ఎలా వాడాలంటే..?

సత్యమేవ జయతే - ఆరోగ్య చిట్కాలు

దాల్చిన. చెక్కను మనం సాధారణంగా మసాలా వంటల్లో వేస్తుంటాం. ఇది లేకుండా మసాలా వంటకాలు పూర్తి కావు. శాకాహారం లేదా మాంసాహారం ఏది వండినా మసాలా అంటే మనకు ముందుగా దాల్చిన చెక్క గుర్తుకు వస్తుంది. అయితే ఆయుర్వేద ప్రకారం దాల్చిన చెక్కలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. పలు అనారోగ్య సమస్యలను తగ్గించేందుకు గాను దాల్చిన చెక్కను భిన్న రకాలుగా తీసుకోవాల్సి ఉంటుంది. దాల్చిన చెక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. దీంతో మంచి ఫలితాలు ఉంటాయి. వాత సంబంధిత వ్యాధుల్లో దాల్చిన చెక్క అద్భుతంగా పనిచేస్తుంది. దాల్చిన చెక్కను తీసుకుంటే వాతం తగ్గిపోతుంది. శరీరంలో అధికంగా ఉండే నీటిని తొలగించడంలోనూ దాల్చిన చెక్క బాగానే పనిచేస్తుంది. మైగ్రేన్ ఉన్నవారు దాల్చిన చెక్క నీళ్లను తాగుతుంటే ఉపశమనం లభిస్తుంది.

మహిళల సమస్యలకు..

స్వర పేటిక వాపు, గొంతు బొంగురు పోవడం వంటి సమస్యలు ఉన్నవారు దాల్చిన చెక్కను బుగ్గన పెట్టుకుని నమిలి రసాన్ని మింగుతుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. మహిళల్లో రుతు సమయంలో వచ్చే సమస్యలను తగ్గించడంలోనూ దాల్చిన చెక్క ప్రయోజనకారిగా ఉంటుంది. అధిక రక్త స్రావం అవకుండా నివారిస్తుంది. దాల్చిన చెక్కను తరచూ తింటే మహిళల్లో ఉండే గర్భ దోషాలు పోతాయి. గ్యాస్ సమస్య ఉన్నవారికి దాల్చిన చెక్క మంచి ఫలితాన్ని ఇస్తుంది. జిగట విరేచనాలను సైతం తగ్గిస్తుంది. దాల్చినచెక్కను కాస్త ఉడకబెట్టి అందులో నెయ్యి, పటిక బెల్లం కలిపి తీసుకోవాలి. దీంతో విరేచనాలు తగ్గుతాయి. దాల్చిన చెక్కలో ఉండే క్యాల్షియం, పీచు పదార్థం గుండెను సంరక్షిస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి.

ఇన్‌ఫెక్షన్లు తగ్గేందుకు..

దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌తో పోరాడుతాయి. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రక్తహీనతతో బాధపడేవారు దాల్చిన చెక్కను పొడిగా చేసి రోజూ తింటే మంచి ఫలితం ఉంటుంది. దాల్చిన చెక్క చర్మానికి మేలు చేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త దాల్చిన చెక్క పొడి, తేనె వేసి కలిపి రోజూ ఒకసారి సేవిస్తుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. దాల్చిన చెక్క పొడిని గంధం, రోజ్ వాటర్‌తో కలిపి ఫేస్ ప్యాక్‌లా చేయాలి. దీన్ని ముఖానికి రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. తరచూ ఇలా చేస్తుంటే ముఖం కాంతివంతంగా మారి మొటిమలు, మచ్చలు పోతాయి. దాల్చిన చెక్క పొడిని తేనెతో కలిపి రాత్రి పూట తింటున్నా కూడా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

శ్వాసకోశ సమస్యలకు..

దాల్చిన చెక్క పొడిలో కాస్త నిమ్మరసం కలిపి పేస్ట్‌లా చేసి రాస్తుంటే మొటిమలు, బ్లాక్ హెడ్స్ పోతాయి. రక్తహీనత తగ్గేందుకు దాల్చిన చెక్క పొడిలో దానిమ్మరసం, తేనె కలిపి తీసుకోవాలి. దాల్చిన చెక్క పొడి, శొంఠి పొడి, జీలకర్ర పొడిని సమాన భాగాల్లో తీసుకుని అర టీస్పూన్ తేనెతో కలిపి రోజుకు 2 పూటలా తింటే జీర్ణ శక్తి పెరుగుతుంది. విరేచనాలు తగ్గుతాయి. దాల్చిన చెక్క, మిరియాలు, యాలకులు, నల్ల జీలకర్రను సమానంగా తీసుకుని పొడి చేసి వాసన పీలుస్తుంటే కఫం కరిగిపోతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు పోయి గాలి బాగా ఆడుతుంది. దాల్చిన చెక్క, మిరియాలను కలిపి కషాయంలా చేసి తాగుతుంటే జలుబు త్వరగా తగ్గుతుంది. రాత్రి పూట ఒక కప్పు గోరు వెచ్చని నీటిలో కాస్త దాల్చిన చెక్క పొడి, తేనె కలిపి తాగుతుంటే మైండ్ రిలాక్స్ అయి నిద్ర చక్కగా పడుతుంది. ఇలా దాల్చిన చెక్కతో అనేక లాభాలను పొందవచ్చు. (నోట్ : ఇంటర్నెట్‌లో మరియు పుస్తకాల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు 'సత్యమేవ జయతే' బాధ్యత వహించదు.)

# కాణిపాకం-వినాయకుడు

**సత్య ప్రమాణాలకు నెలవుగా.. అసత్యాలు చెప్పేవారికి సింహస్వప్నంగా చిత్తూరు జిల్లా కాణిపాకం- శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయం భాసిల్లుతోంది. కాణిపాకం వద్ద బహుదా నది ఒడ్డున ఈ ఆలయం ఉంది. సర్వమత ఆరాధ్యుడుగా కాణిపాకం వరసిద్ధి వినాయకుడు పూజలందుకుంటున్నారు. ఈ స్వామికి హిందువులే కాదు. ఇతర మతస్థులూ మొక్కులు తీర్చుకుంటారు. ముఖ్యంగా స్వామివారి దర్శనార్థం నిత్యం వందల సంఖ్యలో ముస్లింలు రావడం విశేషం. దేవుడు ఒక్కడే అన్న నిదర్శనం ఇక్కడ కనిపిస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సైతం ఇతర మతస్థులు పాల్గొంటారు. క్షేత్రచరిత్ర/ స్థలపురాణం: సుమారు 1,000 ఏళ్ల కిత్రం ఈ ఆలయ నిర్మాణం జరిగినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. పూర్వం విహారపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు గుడ్డి, మూగ, చెవిటి వాళ్లుగా జన్మించారు. కర్మఫలాన్ని అనుభవిస్తూ.. ఉన్న పొలాన్ని సాగు చేసుకొంటూ జీవించేవారు. ఒక దశలో ఆ గ్రామం కరవు కాటకాలతో అల్లాడింది. గ్రామస్థులకు కనీసం తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకని దుస్థితి నెలకొంది. కరవును జయించాలని సంకల్పించిన ముగ్గురు సోదరులు తమ పొలంలో ఉన్న ఏతం బావిని మరింత లోతు చేయాలనుకున్నారు. ఆ మేరకు బావిలో తవ్వుతుండగా ఓ పెద్ద బండరాయి అడ్డుపడింది. దాన్ని తొలగించే యత్నంలో పార రాయికి తగిలి రాయి నుంచి రక్తం చిమ్మింది. రక్తం అంగవైకల్య సోదరులను తాకగానే.. వాళ్ల వైకల్యం తొలగింది. జరిగిన ఈ విచిత్రాన్ని తెలుసుకున్న గ్రామస్థులు ఆ స్థలానికి వచ్చి బావిని పూర్తిగా తవ్వి పరిశీలించారు. బావిలో 'గణనాథుని' రూపం కన్పించింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో దాన్ని పూజించి స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించారు. స్వామికి గ్రామస్థులు సమర్పించిన కొబ్బరికాయల నీరు 'కాణి'భూమి( కాణి అంటే ఎకరం పొలం అని అర్థం) మేర పారింది. అప్పట్నుంచి విహారపురి గ్రామానికి 'కాణిపారకరమ్' అన్న పేరు వచ్చింది. కాలక్రమంలో అదే 'కాణిపాకం'గా మారిందని ప్రశస్తి.**

కాణిపాకం వరసిద్ధి వినాయకుడు సత్య ప్రమాణాల దేవుడిగానూ ప్రసిద్ధికెక్కారు. స్వామివారి ఎదుట ఎవరైనా తప్పుడు ప్రమాణం చేస్తే.. వారిని స్వామియే శిక్షిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వ్యసనాలకు బానిసలైన వారు (తాగుడు, దురలవాట్లు) స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని భక్తుల నమ్మకం. అసెంబ్లీలో సైతం రాజకీయ నేతలు 'కాణిపాకం'లో ప్రమాణం చేద్దామా? అని సవాల్ విసురుకోవడం స్వామి మహిమను చెప్పకనే చెబుతోంది..!

నిత్యం పెరిగే స్వామి: వరసిద్ధి వినాయకుడు నిత్యం పెరుగుతున్నాడు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఉంది. యాభై ఏళ్లనాటి వెండి కవచం ప్రస్తుతం స్వామివారికి సరిపోవడం లేదు. 2002 సంవత్సరంలో భక్తులు స్వామివారికి విరాళంగా సమర్పించిన వెండి కవచం సైతం ప్రస్తుతం స్వామివారికి ధరింపచేయడం సాధ్యం కావడం లేదు.

కాణిపాకం శివ-వైష్ణవ క్షేత్రంగా భాసిల్లుతోంది. ప్రధాన గణనాథుని ఆలయం దగ్గర్నుంచి అనుబంధ ఆలయ నిర్మాణాలకు సంబంధించి విశిష్ట పురాణ ప్రాధాన్యం ఉంది. ఒకే చోట వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, మణికంఠేశ్వర, వరదరాజులు, వీరాంజనేయ స్వామి వారి ఆలయాలున్నాయి.

బ్రహ్మహత్యా పాతక నివారణార్థం: స్వయంభువు వరసిద్ధి వినాయకస్వామి గుడికి వాయువ్య దిశగా ఉన్న మణికంఠేశ్వరస్వామి ఆలయం ప్రధాన ఆలయానికి అనుబంధ నిలయం. దీన్ని 11 వ శతాబ్దంలో చోళరాజు కుళోత్తుంగ మహారాజు నిర్మించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. బ్రహ్మహత్యా పాతక నివ ృత్తి కోసం శివుడి ఆజ్ఞ మేరకు ఈ ఆలయం నిర్మించారట! అద్భుత శిల్పకళ ఈ ఆలయం సొంతం. ఇక్కడ మహాగణపతి, దక్షిణామూర్తి, సూర్యుడు, షణ్ముఖుడు, దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఆలయ గాలి గోపురం, ప్రాకార మండపాల్లో శిల్పకళ ఉట్టిపడే దేవతామూర్తుల ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. లోపల మరగదాంబిక అమ్మవారి గుడి ఉంది. ఇక్కడ సర్పదోష నివారణ పూజలు చేస్తారు. ఏటా అమ్మవారి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు: మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రతి గురువారం దక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేస్తారు.

**సర్పదోష పరిహారార్థం.. వరదరాజస్వామి ఆలయ నిర్మాణం**

స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి వరదరాజస్వామి ఆలయ నిర్మాణం జరిగింది. గణనాథుని ఆలయానికి ఎదురుగా ఉన్న ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి పురాణాల్లో ఓ కథ ప్రచారంలో ఉంది. జనమేజయ మహారాజు చేపట్టిన సర్పయాగ దోష పరిహారానికిగానూ శ్రీ మహావిష్ణువు ఆజ్ఞ మేరకు ఇక్కడ వరదరాజస్వామి ఆలయం నిర్మితమైనట్టు చెబుతారు. ఆలయంలోని మూలవిరాట్ ఆకారంలో సుందరశిల్ప కౌశల్యం ఉట్టిపడుతుంది. ఆలయంలో నిత్యం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తుంటారు.

**పంచామృతాభిషేకం టిక్కెట్ ధర: రూ. 550**



సేవాఫలితం: స్వామివారిని పంచామృతాలతో అభిషేకం చేయడం పుణ్యఫలం. ఈ సేవల్లో పాల్గొనడం వలన అన్ని కష్టాలు తొలగుతాయి.

**గణపతి హోమం టిక్కెట్ ధర: 500**

సేవాఫలితం: 'కలౌ చండీ వినాయకః' అంటే ఈ కలియుగమున పిలవగానే పలికే దేవతలు.. చండి(దుర్గా), గణపతి. మన దైనందిన జీవితంలో ఎన్నో విఘ్నాలు, ప్రతి పనికి పోటీ, ఏదో ఒక ఆటంకం జరగవచ్చు. అన్ని విఘ్నాలను అధిగమించాలి. అంటే గణపతిని అగ్నియుక్తంగా పూజించాలి. స్వామివారి సన్నిధిలో గణపతి హోమం చేసుకోవడం వల్ల విఘ్నాలు తొలగిపోతాయి. సకల శుభాలు కలుగుతాయి.

**గణపతి మోదకపూజ టిక్కెట్ ధర: 300**

గణపతి పురాణంలో సహస్రనామాల్లో 'మోదక ప్రియాయనమః' అని ఉంది. మోదకం అంటే కుడుములు అని అర్థం. హిందువులు ఏ శుభకార్యం చేయాలన్న ముందుగా వినాయకుడికి కుడుములు నైవేద్యంగా సమర్పిస్తారు. ఆలయంలో గణపతి మోదక పూజ చేయడం వల్ల స్వామివారి అనుగ్రహం పొందుతారు.

**సహస్ర , వ్రతపూజ టిక్కెట్ ధర: రూ. 150, రూ. 58**

సేవాఫలితం: 'కలౌ గణేశ' స్మరణామున్ముక్తి అన్న నానుడిని అనుసరించి స్వామివారికి 1008 నామాలు అర్పించడం వల్ల విశేషఫలం కలుగుతుంది.

**మూల మంత్రార్చన టిక్కెట్ ధర: రూ. 300**

సేవాఫలితం: వినాయకుని గణాధిపతిగా నియమించిన తర్వాత.. అక్కడ విష్ణుమూర్తి దర్శనమిచ్చారు. వినాయకుడు విష్ణువు చేతిలోని సుదర్శన చక్రాన్ని తీసుకున్నాడు. విష్ణువు అడిగినా తిరిగి ఇవ్వలేదు. దీనికి బదులుగా ఏదైనా వరం కోరుకొమ్మని విష్ణుమూర్తి అంటే త్రినేత్రములు గల శిరస్సు కావాలని గణపతి కోరతాడు. అప్పుడు విష్ణుమూర్తి బ్రహ్మదేవుని సహాయంతో నారికేళాన్ని స ృష్టించి ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే గణపతిని అవాహనం చేసి నారికేళంతో పూజిస్తే మహాగణపతి సంతుష్టి చెందుతారు. సకల విఘ్నాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయి.

**సంకటహార గణపతి వ్రతం టిక్కెట్ ధర: రూ. 151**

సేవాఫలితం: గణేశ పురాణంలో ఈ వ్రతానికి విశేష స్థానం కల్పించారు. దీన్ని శ్రీ క ృష్ణుడు, బ్రహ్మదేవుడు తదితరులు ఆచరించారు. సంతానం, వ్యాపార అభివ ృద్ధి, సకల విఘ్నాలు తొలగడం, ముఖ్యంగా కోర్టు వ్యవహారాల్లో జయం కలగడానికి దీన్ని ఆచరిస్తారు.

**పూలంగి సేవ టిక్కెట్ ధర: రూ. 1,000**

సేవాఫలితం: వివిధ రకాలైన పుష్పాలను గర్భాలయం, అంత్రాలయం, అర్ధమండపం, స్వామివారికి విశేష పుష్పాలకంరణ చేస్తారు. రంగుల పుష్పాలతో స్వామివారిని పూజించడం వల్ల లక్ష్మీ అనుగ్రహం, సౌభాగ్యం కలుగుతాయి.

**అక్షరాభ్యాసం టిక్కెట్ ధర: రూ. 116**

సేవాఫలితం: చదువుల తండ్రి వినాయకుడు. అలాంటి వినాయకుడి ఆలయం వద్ద అక్షరాభ్యాసం చేసుకుంటే పిల్లల చదువులు వ ృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో నిత్యం అక్షరాభ్యాసం జరుగుతుంటుంది.

**అన్నప్రాసన టిక్కెట్ ధర: రూ.116**

సేవాఫలితం: పిల్లలకు అన్నప్రాసనం, విశిష్ఠరోజున చేస్తారు. విఘ్నాలను తొలగించే వినాయకుని ఆలయంలో అన్నప్రాసన చేయడం శుభం. ఇక్కడ అన్నప్రాసన చేయడం వల్ల పిల్లలకు జీవితంలో మంచి జరుగుతుంది. మొదటి పూజలు అందుకునే వినాయకుడి ఆలయంలో అన్నప్రాసన చేస్తే మంచిదని పురాణాలు చెబుతున్నాయి.

**వివాహ ఆహ్వానపత్రికలకు పూజలు టిక్కెట్ ధర: రూ. 51**

సేవాఫలితం: వివాహం చేసుకునే నూతన జంటలకు సంసార జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు జరగకుండా ఉండాలని వినాయకుని చెంత పూజలు చేస్తారు.

# మంత్రతంత్రాలతో పూజ చేస్తేనే భక్తి అంటారా?



మంత్రతంత్రాలతో పూజ చేస్తేనే భక్తి అంటారా? యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తేనే భక్తులా? ఏది భక్తి? ఎవరు భక్తుడు? భక్తి మనలో కలిగే చలనం. భక్తుడు సమాజాన్ని మార్చగలిగే సంచలనం. భగవంతుడిని చూడాలనే నిరంతర అన్వేషణే తపస్సు! అందరిలోనూ భగవంతుడిని దర్శించడమే శ్రేయస్సు!!

ఏ వేదాలు పఠించి
సాలీడు హరుడి కరుణ పొందింది.
ఏ శాస్త్రాలు చదివి భుజంగం నాగభూషణుడి
అనుగ్రహం అందుకుంది.
ఏ విద్యలు అభ్యసించిందని ఏనుగుకు
పరమేశ్వరుడి దర్శనభాగ్యం దక్కింది.

భక్తి పథంలో భగవంతుడికి తరతమ భేదాలు ఉండవని నిరూపించిన శ్రీకాళహస్తీశ్వరుడి కథ ఇది. భగవంతుడు నావాడు అనుకోవడమే అసలైన భక్తి. ఈ చరాచర సృష్టిలో అణువణువూ దైవం నిండి ఉన్నదని గ్రహించినవాడే సిసలైన భక్తుడు. తన మదిలో, ప్రతి హృదిలో దేవుణ్ని చూసిన వాడే నిఖార్సయిన సాధకుడు. భక్తి అనే పదం వింటేనే మానవుడిలో తెలియకుండానే ఒక చలనం కలుగుతుంది. తనలో భక్తి పొటమరించే కొద్దీ ఆ భక్తుడే సంచలనంగా మారుతాడు. ఈ చలనం (గమనం), సంచలనం( పురోగమనం) మానవుని మనుగడలో, మానవజాతి పురోభివృద్ధిలో అనాదిగా దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయి. అందుకే, ఇతర జంతువులకు మానవులకు ఆహారం, నిద్ర మొదలైనవి సమానమే! కాని, ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను సాధించగలిగే, పొందగలిగే యోగ్యత మనిషికే ప్రసాదించాడు భగవంతుడు. అందులోనూ పరమ పురుషార్థంగా పేర్కొన్న మోక్షాన్ని సాధించాలంటే మన శాస్త్రాలు ప్రధానంగా మూడు మార్గాలను ఉపదేశించాయి. అవే జ్ఞానం, కర్మ, భక్తి.

**మోక్షసాధన ఎలా?**

మోక్ష సాధనలో జ్ఞానం, కర్మ మార్గాలు కొన్ని పరిమితులకు లోబడి సర్వజన సాధారణం కాలేకపోయాయి. అంటే, జ్ఞాన, కర్మ సాధన అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ, అందరికీ అనువైన మోక్ష మార్గం భక్తి. ఈ మార్గంలో చిన్నాపెద్దా వ్యత్యాసం ఉండదు. పేద-గొప్ప తేడాలు ఉండవు. అందరూ అతిసులభంగా అనుసరించగలిగే మార్గం ఇది.

అందుకే శ్రీ శంకర భగవత్పాదులు వివేకచూడామణిలో 'మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ- భక్తి మానవుడికి మోక్ష సాధనలో ముఖ్య సాధనం' అని తెలియజేశాడు. శ్రీకృష్ణ భగవానుడు 'మన్మనా భవమద్భక్తః- తనయందు అనన్యమైన భక్తి కలవాడు తనను పొందగలడు' అని భగవద్గీతలో పేర్కొన్నాడు.

**అనన్య ప్రేమ**

ఇంతకీ భక్తి అంటే ఏమిటి? ఇదే విషయాన్ని నారద మహర్షి 'భక్తి సూత్రాల్లో' ప్రస్తావిస్తూ 'సాత్వస్మిన్ పరమప్రేమరూపా' అని పేర్కొన్నాడు. అంటే, భగవంతుడిపై అనన్యమైన ప్రేమ కలిగి ఉండటమే నిజమైన భక్తి అని నిర్వచించాడు. ఇదే మార్గాన్ని అనుసరించి శ్రీకృష్ణుడి అనుగ్రహాన్ని పొందారు గోపికలు.

'చిత్తం సుఖేన భవతాపహృతం గృహేషు
యన్నిర్విశత్యుత కరావపి గృహ్యకృత్యే
పాదౌ పదం న చలతస్తవ పాదమూలాద్యామః
కథం వ్రజమథో కరవామ కిం వా'

'కృష్ణా మా మనసును హరించావు. ఇక మేము ఎటు వెళ్లేది- ఎటూ వెళ్లలేమ'ని అన్నారు. అవ్యాజమైన ప్రేమతో మురళీమోహనుడి మనసును గెలుచుకున్నారు. దీన్నే అనన్యమైన భక్తి అంటాడు నారదముని. 'అన్యాశ్రయాణాం త్యాగో అనన్యతా' అంటే గోపికల్లా అన్నీ వదిలేసి భగవంతుడిపైనే మనసును లగ్నం చేయాలని సూచించాడు మహర్షి. భాగవతం, ఇతర పురాణ ఇతిహాసాల్లో ప్రహ్లాదుడు, ధ్రువుడు వంటి భక్తులు భగవంతుడిని ఆశ్రయించి పొందిన అనుభూతులు అద్భుతాలే!

పదకొండు సాధనాలు

**'మద్భక్తివిముఖానాం హి శాస్త్రగర్తేషు ముహ్యతాం**
**న జ్ఞానం న చ మోక్షః స్యా త్తేషాం జన్మశతైరపి'**

'ఎంత గొప్ప శాస్త్ర పండితుడికైనా నాయందు భక్తి లేనట్లయితే, ఎన్ని జన్మలెత్తినా వారికి జ్ఞానం రాదు, మోక్షం లభించదు. భక్తి లేని శాస్త్రపాండిత్యం నెత్తిన బండరాయిలా భారమే తప్ప ఉపయోగం లేద'ని సాక్షాత్తూ పరమేశ్వరుడు భక్తి ఔన్నత్యాన్ని తెలియజేశాడు. ఇంతటి సర్వోత్కృష్టమైన భక్తికి నారదమహర్షి, మధుసూదనసరస్వతి మహాపురుషుల సేవతో ఆరంభించి భగవంతుడిపై పరిపూర్ణమైన ప్రేమ కోసం పదకొండు భూమికలను (సాధనాలను) ప్రతిపాదించారు.

మహాత్ములను సేవించడం, సేవతో వారి అనుగ్రహాన్ని పొందడం, వారు ఆచరిస్తున్న ధర్మంపై శ్రద్ధ కలగడం, శ్రీహరి గుణాలను వినడం, శ్రీహరిపై అనురక్తి కలిగి ఉండటం, హరి స్వరూపాన్ని తెలుసుకోవడం, అలా తెలుసుకున్న పరమానంద రూపం మీద ప్రేమ ఉత్పన్నం కావడం, ఆ ప్రేమలో పరమానంద అనుభూతిని పొందడం, భగవత్ సంబంధమైన ధర్మంపై నిష్ఠ కలగడం, ధర్మనిష్ఠ ఏర్పడటంతో భగవత్ గుణాలు వ్యక్తం కావడం, ఫలితంగా భగవంతుడిపై ప్రేమ అభేద స్వరూపమై పరాకాష్ఠకు చేరడం.. ఈ పదకొండు అంచెలను దాటినవారు భగవంతుడిపై అచంచలమైన ప్రేమను పొందుతారు. భగవంతుడి సన్నిధిలేక ఉండలేని స్థితికి చేరుకుంటారు. అదే నిజమైన భక్తి. ఈ స్థితి పొందినవారు 'యత్ప్రాప్య న కించిద్వాంఛతి న శోచతి న ద్వేష్టి న రమతే నోత్సాహీ భవతి- అద్వితీయమైన బ్రహ్మానుభూ తిని కలిగి ఉంటారు' అని తెలియజేశాడు నారదుడు. భక్తి అహంకార రహితమై ఉండాలి. ఆడంబరాలకు దూరంగా ఉండాలి. ప్రచార ఆర్భాటం, పదిమంది మెప్పు కోసం ప్రదర్శించేది నిజమైన భక్తి అనిపించుకోదు.

**నవ విధ మార్గాలు**

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనం
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం**

శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవ, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదన ఈ తొమ్మిది మార్గాల ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చు. వీటినే నవవిధ భక్తి మార్గాలు అంటారు. భక్తుడు తనకున్న శక్తి సామర్థ్యాలు, అవకాశాన్ని బట్టి ఈ తొమ్మిది మార్గాల్లో దేన్నయినా ఎంచుకోవచ్చు. ఏ మార్గాన్ని ఎన్నుకున్నా తుది ఫలితం దైవ సన్నిధానమే!

**తపనే భక్తి**

'రెక్కలు రాని పక్షి పిల్లలు.. తమ తల్లి కోసం, తల్లి వచ్చి ఇచ్చే పాల కోసం లేలేత లేగదూడ చూసే ఎదురు చూపే భక్తి. దేశాంతరం వెళ్లిన ప్రియుడి కోసం బాధతో ప్రియురాలు చూసే ఎదురుచూపే భక్తి. అలాగే, భగవంతుడిని చేరాలనే తపన కలిగి ఉండటమే భక్తి' అని 'భక్తి సుధా' గ్రంథంలో వివరించాడు కరపత్రిస్వామి.

**భావనే బలం**

భక్తులు అనిపించుకోవాలంటే గంటలకొద్దీ పూజలు చేయాలన్న నియమం లేదు. మనం చేసే సత్కర్మలన్నీ భగవంతుడి ప్రీత్యర్థం చేయడమూ భక్తే! గ్రామదేవతకు బోనాలు సమర్పించే క్రమంలో గ్రామీణుల్లో నిష్కల్మషమైన భక్తి ప్రపత్తులు కనిపిస్తాయి. ఆశ్వయుజ మాసంలో ఆలయాల్లో అమ్మవారికి వేదమంత్రాలతో నవరాత్రి ఉత్సవాలు జరుగుతుంటాయి. అదే సమయంలో ఆడబిడ్డలు ఆప్యాయంగా బతుకమ్మ పేర్చి, అనురాగాల రాగాలతో బతుకమ్మ పాటలు పాడుతూ అమ్మవారిని కీర్తించడంలోనూ అసామాన్యమైన భక్తి ఉంటుంది. భగవంతుడిపై మనకు కలిగే భావన బలంగా ఉండాలంటారు పెద్దలు. భక్తి భావన మనసులో బలంగా నాటుకుంటే, హృదయంలోనే దేవుడు కొలువై ఉంటాడు.

# రాశిఫలాలు



**మేషం**

కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. ప్రయత్నకార్యాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

**వృషభం**

శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. ప్రయాణాల వల్ల లాభం చేకూరుతుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుతారు.

**మిథునం**

దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు. కళాకారులు, మీడియా రంగాల వారికి మంచి అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం**

ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ, సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

**సింహం**

స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి.

**కన్య**

సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి.

**తుల**

ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. అనారోగ్య బాధవల్ల బలహీనులవుతారు. ఆత్మీయుల సహకారం లభిస్తుంది. ఆకస్మిక ధననష్టం ఏర్పడే అవకాశం ఉంది. అధికార భయం ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది.

**వృశ్చికం**

శత్రుబాధలు తొలగిపోతాయి. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు**

రుణలాభం పొందుతారు. స్థానచలనం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. మెలకువగా ఉండటం అవసరం. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఉంటాయి.

**మకరం**

చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**కుంభం**

మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. తలచిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్యబాధలుండవు.

**మీనం**

కళాత్మక వస్తువులను సేకరిస్తారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. ప్రయత్నకార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం ఏర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. బంధు, మిత్రులను కలుస్తారు. కొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.



# నిన్నే గిల్లుకోలేకపోయావా?..

తర్కం లేని భక్తిని, ఆచారాలను రమణ మహర్షి తీవ్రంగా ఖండించేవారు. ఒకసారి ఒక భక్తురాలు అరుణాచలం వచ్చింది. మహర్షిని దర్శించుకుని ఆశీస్సులు అందుకుంది. స్వామితో 'భగవాన్! నేను లక్ష పత్రుల వ్రతం చేశాను' అని గర్వంగా చెప్పింది.

అప్పుడు రమణులు ఆమెతో 'అయ్యో! నీ వ్రతం కోసం చెట్టును అన్నిసార్లు గిల్లి ఆకులు కోశావా. అలాంటి వ్రతం చేయడం ఎందుకు? నిన్నే నువ్వు లక్షసార్లు గిల్లుకోలేకపోయావా!' అన్నారు. ఇలా భక్తి పేరుతో మూరంగా ప్రవర్తించేవారిని రమణులు కట్టడి చేసేవారు. భక్తిని చాటుకునేందుకు ఏ ప్రాణినీ హింసించాల్సిన అవసరం లేదని తెలియజెప్పేవారు.

## ఎడిటోరియల్

# బుద్ధగయపై ఎందుకీ రాద్ధాంతం?

బౌద్ధ సాంప్రదాయంలో బుద్ధ గయకు విశిష్టమైన స్థానమున్నది. ప్రపంచాన్ని ఆయుధాలతో కాకుండా ఆశయాలతో సమత, మమత, కరుణలతో జయించిన మతం బౌద్ధం. అటువంటి మహోన్నత మతానికి బుద్ధ గయ తో విడదీయరాని బంధమున్నది. గౌతమ బుద్ధుడు సత్యాన్వేషణ కోసం తిరిగి తిరిగి ఈ నేలన చేరి తన మార్గాన్ని కనుగొన్నది ఇక్కడే. ఇది అందరికీ తెలిసిందే. సామ్రాట్ అశోకుడు తాను బౌద్ధాన్ని స్వీకరించిన తర్వాత బౌద్ధం విస్తరించిన నేలలో అనేక చోట్లలో తన స్థూపాలను నిర్మించాడు. అందులో బుద్ధుడు జన్మించిన లుంబిని మొదలుకొని మహాపరి నిర్వాణం పొందిన కుషినారా (నేటి కుషి నగర్) వరకు 84 వేల స్థూపాలను స్థూపాలను నిర్మించినట్టు శిలా శాసనం ద్వారా తెలుస్తున్నది.

నిజానికి బౌద్ధం మరొకసారి ప్రపంచమంతా విస్తరిస్తున్నదంటే ఈ స్థూపాల ఆధారమే ప్రధానం. ఒకవేళ అశోకుడు ఆ రోజు స్థూపాల నిర్మాణం జరిపి ఉండకపోతే బౌద్ధాన్ని కట్టుకథలని తేల్చి వేసేవారు. అటువంటి స్థూపాలు, శిలా శాసనాలలో భాగమే బుద్ధ గయ స్థూపం. అందుకే కట్టుకథ కాదు. కల్పితం కాదు. బుద్ధ గయ గౌతమ బుద్ధుడు నిరంజన నది ఒడ్డున ఉన్న బోధి వృక్షం కింద ఎన్నో రోజులు దీర్ఘ చింతనలో ఉండి, తాను అన్వేషిస్తున్నసత్యాన్ని కనుగొన్నట్టు మనకు చరిత్ర ఆధారాలున్నాయి. అప్పటి వరకు అక్కడ ఎటువంటి మతాలు, దేవుళ్లు ఉన్నట్టు ఎటువంటి పురాతత్వ, చారిత్రక ఆధారాలు లేవు. అంటే బుద్ధ గయ బౌద్ధుల ఆరాధన స్థలం.

ఇందులో ఎటువంటి వివాదం లేదు. అయితే బుద్ధ గయ ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప దర్శనీయ స్థలం. ఏటా కొన్ని లక్షల మంది బుద్ధ గయను సందర్శిస్తుంటారు. అయితే ఈ రోజు బుద్ధ గయ మరొక సారి చర్చలోకి వచ్చింది. గత రెండు నెలలకు పైగా బౌద్ధ సంఘాలు, బౌద్ధ బిక్కులు బుద్ధ గయ బౌద్ధులదే అంటూ, ఇది ఇతరుల పాలనలలో అంటే ఇతరుల జోక్యంతో కొనసాగకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. బుద్ధ గయ అంటే మొత్తం పట్టణం కాదు. బుద్ధ గయలో ఉన్న మహాబోధి బౌద్ధాలయం ఇతరుల అజమాయిషిలో ఉండకూడదని ఆ సంఘాలు వాదిస్తున్నాయి.

అయితే చరిత్రలో బుద్ధ గయలోని బుద్ధునిస్థలం, బోధి వృక్షం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. అన్నింటిని తట్టుకొని ప్రపంచమంతటినీ ఆకర్షిస్తున్నది. సామ్రాట్ అశోకుడు బుద్ధ గయలో ఇప్పుడు ఉన్న స్థలాన్ని గుర్తించి ఇది గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన స్థలంగా ప్రకటించి ఇక్కడ బౌద్ధ రామాన్ని, స్తంభాలను నిర్మించాడు. దానితో ఇది గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన స్థలంగా చరిత్రలోకెక్కింది. గౌతమ బుద్ధుడు ఆసీనుడైన స్థలంలో ఉన్న బోధి వృక్షం నుంచి వేరు చేసిన కొమ్మ నుంచి మళ్లీ వెలిసిన చెట్టుగానే భావిస్తున్నారు. ఎందుకంటే అనేక సార్లు ఈ చెట్టు నరికివేతకు గురైంది. హిందూ మత పెద్దలు, ముస్లిం పాలకులు, రాజులు అనేక సార్లు ఈ ప్రదేశాన్ని రకరకాలుగా విధ్వంసానికి గురి చేశారు.

బౌద్ధం క్రమక్రమంగా వెనుక తగ్గిన కొద్దీ ఈ ప్రదేశం కూడా నిరాధరణకు గురైంది. ఆ తర్వాత కొద్ది మంది మహాబోధి బౌద్ధ ఆలయంలో, ఆవరణలో ఒక శివ లింగాన్ని స్థాపించి తమ పూజలను నిర్వహించడం మొదలుపెట్టారు. అయితే మళ్లీ ఇది తెర మీదికొచ్చింది. బౌద్ధ ఆచార్యుడు అనాగారిక ధర్మపాల ఉద్యమం తర్వాతనే. 1891 లో మొదటిసారిగా అనాగారిక ధర్మపాల బుద్ధ గయను సందర్శించారు. అప్పటికి పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. ఎటువంటి ఆదరణ లేదు. ఆ స్థలంలో ఎన్నో చారిత్రక అవశేషాలు ఉన్నప్పటికీ హిందూ మతాధిపతులు అక్కడ హిందూ సాంప్రదాయంలో పూజలు నిర్వహిస్తుండేవారు. ఎటువంటి బౌద్ధ మత సాంప్రదాయాలు లేవు. బౌద్ధులకు అక్కడ స్థానం లేదు. అయితే అనాగారిక ధర్మపాల అక్కడ బౌద్ధాన్ని మళ్లీ ప్రతిష్టింప చేసేందుకు గొప్ప ఉద్యమం చేయాల్సి వచ్చింది. అనాగారిక ధర్మపాల శ్రీలంకకు చెందిన బౌద్ధ ఆచార్యుడు.

ఆయన 1864లో శ్రీలంకలోని బౌద్ధుల కుటుంబంలో జన్మించారు. ఆయన క్రిస్టియన్ కళాశాలలో చదువుతున్న రోజుల్లో పాశ్చాత్య బౌద్ధ తాత్వికులు మేడమ్ బ్లవట్స్కి, కలొనల్ ఒల్‌కోల్‌లతో ధర్మపాల స్ఫూర్తి పొందారు. ఈ ఇద్దరు న్యూయార్క్‌లో థియో సొఫికల్ సొసైటీని స్థాపించారు. ఆ సంస్థ ద్వారా 300కు పైగా బౌద్ధ పాఠశాలలను నిర్మించారు. వారి స్ఫూర్తితో అనాగారిక ధర్మపాల బౌద్ధం కోసం తన జీవితాన్ని అంకితం చేయాలనుకున్నారు. ముందుగా ఆయన బుద్ధ గయను సందర్శించారు. 1885లో మొదటిసారి ప్రముఖ బౌద్ధ రచయిత లైట్ ఆఫ్ ఆసియా పుస్తక రచయిత సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్‌తో కలిసి బుద్ధ గయ వచ్చారు. ఆ తర్వాత ధర్మపాల ప్రపంచమంతా పర్యటించి మళ్లీ 1891లో బుద్ధ గయ వచ్చారు. అయితే ఒక యాత్రికుడిగా కాకుండా, ఒక ఉద్యమ సారథిగా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు.

తన కార్య స్థలం బుద్ధ గయని, తన నివాస స్థలం కలకత్తాగా నిర్ణయించుకున్నారు. అప్పటి వరకు బుద్ధ గయ హిందువుల ఆధీనంలోనే ఉండేది. దానిని విముక్తి చేయడానికి తన పోరాటాన్ని మొదలు పెట్టారు. హిందూ పూజారుల ఆధీనంలో నుంచి బుద్ధ గయ బౌద్ధాలయాన్ని విముక్తి చేయాలని, దానిని బౌద్ధులకు అప్పగించాలని ఆయన కోర్టులో దావా వేశారు. కాని ఆయన తన పోరాటంలోనే పరి నిర్వానం పొందారు. 1933లో ధర్మపాల కన్నుమూసిన తర్వాత ఆ ఉద్యమం మరింత ముందుకు పోయింది. ఆయన స్థాపించిన మహా బోధి సొసైటికి 1949లో కొంత స్థలాన్ని అప్పగించారు. ఇప్పుడు మనం దర్శిస్తున్న స్థలం అట్లా మిగిలి ఉందంటే అది కేవలం అనాగారిక ధర్మపాల విజయమే.

# మెగా ఫుడ్ పార్కులతో ఆహార వృథాకు చెక్



భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ. పెరుగుతున్న పునర్వినియోగపరచలేని ఆదాయం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్ వృద్ధికి ఆజ్యంపోసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో భారతదేశం ఒకటి. ప్రపంచంలో భారతదేశం పాలఉత్పత్తిలో మొదటి స్థానం లో, పండ్లు, కూరగాయలు, చేపల ఉత్పత్తిలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమకు ముడిపదార్థాల వనరులు దేశంలో సమృద్ధిగా ఉన్నాయి. అయినప్పటికీ, ప్రాసెసింగ్ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సాంకేతికత లేకపోవడంవల్ల దేశంలో సహజ ఉత్పత్తులు 2-5% కంటే తక్కువ ప్రాసెస్ చేయబడుతున్నాయి. సరైన ప్రాసెసింగ్ విధానంలేనప్పుడు వ్యవసాయ ఉత్పత్తులు దాదాపు 25-30 శాతం వృథా అవుతుందని అంచనా వేయబడింది. దేశంలో పాడైపోయే ఉత్పత్తులలో 7% మాత్రమే ప్రాసెస్ చేయబడుతున్నాయి, యుఎస్‌లో 65%o, ఫిలిప్పీన్స్ 78%, చైనా 23% వంటి దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ సామర్థ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గ్రహించాలి. ప్రభుత్వం ఈ రంగం వృద్ధిని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చెప్పటాల్సిన అవసరం ఉంది. దీనిని అధిగమించడానికి, ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడం అవసరం. ఎందుకంటే పాడైపోయే వ్యవసాయ ఉత్పత్తుల జీవితకాలం పెంచడం, విలువ జోడింపు ప్రోత్సహించడం భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని సజీవంగా ఉంచుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2008 సంవత్సరంలో ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా మెగా ఫుడ్ పార్క్ పథకాన్ని అమలు చేసింది. అది రైతులు, ప్రాసెసర్లు రిటైలర్లను ఒకచోట చేర్చి వ్యవసాయ ఉత్పత్తిని మార్కెట్‌కు అనుసంధానించడానికి ఒక యంత్రాంగాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా వృథాను తగ్గించడం, గ్రామీణ రంగం లో రైతుల ఆదాయాన్ని పెంచడం ఉపాధి అవకాశాలను సృష్టించడం. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి చేయడానికి క్లస్టర్ విధానంపై ఆధారపడి ఉంటుంది. మెగా ఫుడ్ పార్క్ అంటే పొలం నుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను అందించడం. మెగా ఫుడ్ పార్కులు క్లస్టర్ ఆధారిత విధానం ద్వారా పొలంనుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్‌కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను సృష్టిస్తాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌లో సాధారణ సౌకర్యాలు ఎనేబుల్ మౌలిక సదుపాయాలు సృష్టించబడతాయి. ప్రాథమిక ప్రాసెసింగ్ నిల్వ కోసం సౌకర్యాలు పొలం దగ్గర ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాలు రూపంలో సృష్టించబడతాయి. ఈ పథకం కింద, భారత ప్రభుత్వం ప్రతి మెగాఫుడ్ పార్క్ ప్రాజెక్టుకు రూ. 50 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. సేకరణ కేంద్రాలు వ్యక్తిగత రైతులు, రైతు సంఘాలు స్వయం సహాయక బృందాల నుండి ఉత్పత్తులను సమీకరించే కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి ముడి పదార్థాలను ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలకు అందిస్తాయి. సేకరణ కేంద్రాలు స్థానిక వ్యవస్థాపకులు నిర్వహిస్తారు. ఇవి 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న ప్రక్కనే ఉన్న ప్రాంతాలకు వ్యవసాయ స్థాయి సమీకరణ కేంద్రాలుగా పనిచేస్తాయి. ఇసిసిలు గ్రామీణ వాణిజ్య కేంద్రాలుగా ఉద్భవించి, ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయి. ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు పిసిసిలు ప్రాథమిక నిర్వహణ కేంద్రాలను కలిగి ఉంటాయి. ఇవి సిపిసిలో మరింత ప్రాసెస్ చేయడానికి ముడి పదార్థాలను ఉపయోగిస్తాయి. పిపిసి సమీపంలో అనేక సిసిలకు సేవలు అందిస్తుంది. కొన్ని పిపిసిలు పల్పింగ్, జ్యూసింగ్ మొదలైన వాటితో సహా ఇంటి లోపల సౌకర్యాలను కలిగి ఉంటాయి. సాధ్యమైనంత తక్కువ సమయంలో సిపిసికి పదార్థాన్ని రవాణా చేయడానికి రిఫ్రిజిరేటర్ వ్యాన్లు, ట్రక్కులు వంటి సౌకర్యాలను కలిగి ఉంటాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఒక పారిశ్రామిక పార్క్, వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యంలోని అనేక ప్రాసెసింగ్ యూనిట్లను కలిగి ఉంది. ఇక్కడ, అభివృద్ధి చెందిన భూమిని పెద్ద, మధ్య తరహా యూనిట్లకు అందించబడుతుంది. కామన్ డిజైన్ ఫ్యాక్టరీ షెడ్లను చిన్నతరహా యూనిట్లకు అందిస్తారు. ఈ పార్క్ నీరు, విద్యుత్, మురుగునీటి శుద్ధి వంటి సాధారణ సౌకర్యాలను అందిస్తుంది. అంతేకాకుండా ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా కోల్ స్టోరేజ్, వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్, బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ వంటి ప్రత్యేక సౌకర్యాలను అందిస్తుంది. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, 70%కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలు తమ జీవనోపాధి కోసం వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుత దృష్టాంతంలో జిడిపికి వ్యవసాయ రంగం సహకారం క్రమంగా తగ్గుతోంది. భారతదేశ వ్యవసాయ రంగంలో, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమను ఈ రంగం విస్తరణకు అవసరమైన వృద్ధికి ఇంజిన్‌గా చూస్తారు. వ్యవసాయ రంగం 4% వృద్ధి ప్రమాణాన్ని అధిగమించడానికి, దేశంలో పెరుగుతున్న జనాభా పెరుగుతున్న ఆహార డిమాండ్లను తీర్చడానికి ఆహార ప్రాసెసింగ్ రంగం రెండంకెల రేటుతో అభివృద్ధి చెందాలి. దేశంలో మొత్తం ఆహార ఉత్పత్తి రాబోయే దశాబ్దంలో రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయ ఆహార వాణిజ్యంలో దేశం 1.5% కంటే తక్కువగా ఉంది. ప్రాసెసింగ్ సౌకర్యాలు లేకపోవడం అంటే దాదాపు యుఎస్ 10 బిలియన్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులలో 35 శాతం వృథా అవుతోంది. ఈ నేపథ్యంలోనే రైతులు, వ్యాపారుల మధ్య కీలకమైన సంబంధాన్ని అందించడానికి ఫుడ్ పార్కులు ఒక అవసరంగా మారాయి. దేశంలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక బిలియన్ వినియోగదారుల దేశీయ మార్కెట్‌ను ఉపయోగించుకోలేదని అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రభుత్వ కొత్త వాణిజ్య విధానంలో ప్రాధాన్యతా రంగం హోదా పొందాల్సిన అవసరం ఉంది.

# కులాల లెక్కలు.. బిజెపికి చిక్కులు



కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించాలని కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా చెవిటివాని ముందు శంఖంలా ఉంటోంది. మంగళవారం (ఏప్రిల్ 1) కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ అంశంపై సవివరంగా ప్రస్తావించారు. కులాల వారీగా జనగణన ఆలస్యం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. యుద్ధాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర సంక్షోభాల సమయంలో కూడా జనాభా లెక్కల సేకరణ జరిగిందని, కానీ చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వం రికార్డు స్థాయి లో జనగణన నిర్వహించడంలో జాప్యం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీన్ని నిర్వహించడానికి ప్రభుత్వం ఇష్టపడటం లేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ఖర్గే చెప్పిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కులాల ప్రాతిపదికపై జనాభా గణనపై విముఖత ఉన్నట్టు తెలుస్తోంది. కులాల ప్రాతిపదికగా జనాభా లెక్కలను సేకరించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో సుప్రీం కోర్టు ముందు చేతులెత్తేసింది. అప్పటినుంచి ఈ సమస్య కొన్నేళ్లపాటు వాయిదా పడుతోంది. 1881 నుంచి దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరించడం పరిపాటిగా వస్తోంది. 1931 జనాభా లెక్కలకు ముందు మహాత్మాగాంధీ జనాభా లెక్కలు దేశానికి ఎంత ముఖ్యమో ఆయన గుర్తు చేశారు. మన ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి మనకు కాలానుగుణంగా వైద్య పరీక్షలు ఎంత అవసరమో జనాభా లెక్కలు కూడా అంతే అవసరంగా గాంధీజీ ఉదహరించడం ఇక్కడ గమనించాలి. అయితే కులాల వారీ జనాభా లెక్కలు మాత్రం బ్రిటిష్ వారి పాలనలోనే దేశం లో 1933లో చివరిసారి జరిగింది. అప్పటి నుంచి ఆగిపోయిన ఈ ప్రక్రియను తిరిగి చేపట్టాలన్న డిమాండ్ చిరకాలంగా వెనుకబడిన తరగతుల నుంచి వస్తోంది. 1933 నాటి కులాల వారీ సేకరణ ఆధారంగానే ఒబిసిలు దేశ జనాభాలో 36 శాతం మాత్రమే ఉంటారని ఒక వర్గం, 60 నుంచి 70 శాతం వరకు ఉంటారని మరోవర్గం ఎవరికి తోచిన విధంగా వారు వాదన లేవదీయడమే తప్ప కచ్చితమైన వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అయితే దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు అధిక సంఖ్యలోనే ఉంటారని ఎక్కువ శాతం మంది అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం న్యాయం కాదని వెనుకబడిన తరగతుల ఆవేదన అరణ్య రోదనగా ఉంటోంది.

విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 1990లో ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% కోటా కల్పించారు. అప్పటినుంచి తమ జనసంఖ్య ఎంతో తేల్చి ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఆ వర్గాలనుంచి బయలుదేరింది. 2001లోను, 2011లోను జనాభా లెక్కలతోపాటు కులాల వారీ లెక్కలు సేకరించాలన్న ఆలోచన అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అయితే యుపిఎ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల సేకరణలో వేర్వేరుగా సామాజిక, ఆర్థిక కులగణన పేరుతో కొంత సమాచారాన్ని సేకరించింది. ఈ సమాచారం తమకు అందజేస్తే జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల చట్టం కింద ఒబిసిలకు 27% రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలవుతుందని 2021లో మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది.

ఆ మేరకు సుప్రీం కోర్టులో కూడా వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. అయినా కేంద్రం చలించలేదు. ఆ సమాచారం తప్పుల తడకగా ఉందని, దానివల్ల ఎలాంటి ప్రయోజనం కలగదని కేంద్రం సాకులు చెప్పి తప్పించుకుంది. 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులాల వారీ లెక్కలు సేకరించడం సాధ్యం కాదని కేంద్రం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా కుల ప్రాతిపదికన జనగణన చేపట్టాలని నాలుగేళ్ల క్రితం ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసినా ఫలించలేదు. ప్రతి పదేళ్లకు ఓసారి చేపట్టే జనాభా లెక్కల సేకరణలో ఎస్‌సి, ఎస్‌టిల జనగణన సాధ్యమవుతున్నప్పుడు ఇతర వెనుకబడిన తరగతుల వివరాలు సేకరించడం ఎందుకు కష్టమవుతుందని కాంగ్రెస్‌తో సహా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోనే హింసాత్మక ఆందోళనలు చెలరేగడం మరిచిపోలేని వాస్తవం. కులాల గణన పేరు చెబితే కాషాయ నాథులకు కంపరం పుట్టుకొస్తోంది. దీనికి కారణం కులాల శాతాలు బయటపడితే అగ్రవర్ణాలకు దూరం కావలసి వస్తుందని వారి భయం. బిజెపి మొదటి నుంచి హిందుత్వ భావజాలంతో అగ్రవర్ణాలను అక్కునచేర్చుకుని వారిని ఓటు బ్యాంకుగా కొల్లగొడుతోంది. జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు, మైనారిటీలు దాదాపు 80% వరకు ఉన్నారు. వీరంతా పేదరికంలోనే మగ్గుతున్నారు. మిగిలిన 20% అగ్రవర్ణాలు. అగ్రవర్ణాలదే అన్నిటిలో పైచేయిగా ఉంటోంది. దేశ సంపద అంతా అగ్రవర్ణాల అనుభవంలోనే ఉందన్న వాస్తవం గణాంకాలతో బయటపడితే తమ ఉనికికే ముప్పు తప్పదన్న పిరికితనం కమలనాథులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులాల గణనకు ముందుకు రాకుండా ఏవో సాకులతో విపరీత కాలయాపన చేస్తోందన్న విమర్శలు కాంగ్రెస్ తదితర విపక్షాల నుంచి వస్తున్నాయి. అంతేకాదు ఈ సంవత్సరం బడ్జెట్‌లో జనాభా గణన కోసం రూ. 575 కోట్లు మాత్రమే కేటాయించడం బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి కులాల వారీ జనాభా లెక్కల సేకరణ బొత్తిగా ఇష్టం లేదనిపిస్తోందని రాజ్యసభలో విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యల్లో యదార్థం లేకపోలేదు.

సత్యమేవ జయతే



# ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు







**ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు**

**ప్రభుత్వ సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ, ఉత్తమ విద్యాబోధన**

**జిల్లాలో 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**టేక్మాల్ మండల కేంద్రంలో విస్తృత పర్యటన**

**హాస్పిటల్, కేజీబీవీ, సబ్ స్టేషన్ పరిశీలించిన**

**కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్**

ష్ణకు పటిష్ట చర్యలు తీసుకుంటూ, సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ , జిల్లాలో నిరంతర విద్యుత్ అందించడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు
సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్
మందులు నిల్వ చేయి స్టోర్ రూమ్ సంబంధిత వాటిని పరిశీలించి ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు మెరుగైన వైద్య అందించాలని వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టుకోవాలని, సమయపాలనతో విధులు సక్రమంగా నిర్వహించి ప్రభుత్వ ఆదేశించిన లక్ష్యాలను చేరుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలిస్తూ విద్యార్థులను ప్రశ్నలతో , జవాబులతో సామర్థ్యాలను పరీక్షించారు. సానుకూల సమాధానం విద్యార్థుల నుండి రాబట్టి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన మెనూ అందించి
క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. స్టోర్ రూమ్ను పరిశీలిస్తూ కూరగాయలు పప్పు దినుసులు నాణ్యతతో కూడినవి ఉండాలని, భోజనం తయారు చేసిన వెంటనే రుచి సూచి ప్రాధాన్యతనిస్తూ తయారు చేసిన మెనూ తప్పనిసరిగా
టేస్ట్ చూడాలని తదుపరి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించాలని చెప్పారు జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉంటున్నాయని కలెక్టర్ వివరించారు.
తదుపరి మండల కేంద్రంలో 33/11 కేవి విద్యుత్ సబ్స్టేషన్ పరిశీలించి సబ్ స్టేషన్ ద్వారా మండల కేంద్రంలో ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది 24 గంటలు విద్యుత్ అందించడానికి మీ శాఖ ద్వారా తీసుకున్న చర్యలు, ఓవర్ లోడింగ్
,
సంబంధించిన విషయాలను విద్యుత్ శాఖ అధికారులు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేని విద్యుత్ అందించడం లక్ష్యంగా అధికారులను సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జరిగినశ్రీరామనవమి
మునిపల్లి మండల్ పెద్దచెల్మెడలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ భజన చేస్తూ శ్రీరాముని శోభయాత్ర నిర్వహించారు శ్రీరాముని యొక్క గొప్పతనాన్ని చాటి చెబుతూ ఆయన యొక్క ఆదర్శాలను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు

# శ్రీ రాముని సన్నిధిలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





సత్యమే వ జయతే వికారాబాద్ జిల్లా వికారాబాద్ శ్రీరామ నవమి సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని శ్రీరామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో భక్తులతో రామ మందిర%శీ% ఆలయం వద్ద ఆలయానికి భారి గా తరలివచ్చారు పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ శ్రీ రాముని దయతో ప్రజలు సుఖ సంతోషం ఉన్నారని వారు అన్నారు ఈ కార్యక్రమం లో వికారాబాద్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధ సుధాకర్ రెడ్డి సత్య నారాయణ రమేష్. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు..

## బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సత్య మేవ జయతే నారాయణ ఖేడ్సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం రుద్రారం గ్రామంలో భారతీయ జనతా పార్టీ (%దీజీూ%) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నారాయణఖేడ్ మండల్ అధ్యక్షులు సిందోల్ దశరథ్ సీనియర్ నాయకులు విలాస్ రావు పాటిల్ హాజరయ్యారు. భూత్ అధ్యక్షులు గొల్ల విష్ణు పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దశరథ్, సీనియర్ నాయకులు విలాస్ రావు మాట్లాడుతూ.. జన సంగ్ నుంచి 1980, ఏప్రిల్ 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ, దిందయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్‌పేయి, ఎల్కే అద్వాని ఆధ్వర్యంలో బీజేపీగా అవతరించిందన్నారు. అప్పుడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ వరుసగా మూడవసారి అధికారంలోకి రావడం జరిగిందనీ, ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ శక్తి కేంద్రం ఇంచార్జి అంజిరెడ్డి,శక్తి కేంద్రం ఇంచార్జి రఘుపతి రెడ్డి,ప్రవీణ్, అరవింద్,విఠల్,రాజు,కిష్టయ్య, రాజు, భాను గోవింద్ తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బెల్లాపూర్ గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంజీవని హనుమాన్ దేవాలయంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ ఆచార సాంప్రదాయ పద్ధతి ప్రకారం గా శ్రీరామనవమి వేడుకలు కొనసాగించారు. రాములోరి లగ్గం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది.

## నూతన షేట్కార్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన జహీరాబాద్ ఎంపీ





సత్యమేవజయతేబిజహీరాబాద్జహీరాబాద్ మున్సిపల్‌కు చెందిన రాజు షేట్కార్ యొక్క తెలంగాణ-కర్ణాటక సరిహద్దు మాద్గి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన షేట్కార్ ఫిల్లింగ్ స్టేషన్ ను జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షేట్కార్, బాల్కి బసవలింగ పట్టేదేవురా పాల్గొన్నారు. వారితో పాటు అశోక్, ఇతర ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వారిని అభినందనలు తెలుపుతూ ప్రాంతాభివృద్ధికి ఈ స్థాయి సేవలు ఎంతో ఉపయోగపడతాయి అని పేర్కొన్నారు. ఆ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సన్‌రైజర్స్‌కు వరుసగా నాలుగో ఓటమి









సన్‌రైజర్స్‌కు వరుసగా నాలుగో ఓటమి %ఖూా% 2025 : ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ (%బా=ఎ%) హైదరాబాద్ ఆట మారలేదు. బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో వరుసగా నాలుగో ఓటమి మూటగట్టుకుంది. అచ్చొచ్చిన ఉప్పల్ స్టేడియంలో చెలరేగాల్సింది పోయి ప్రత్యర్థికి దాసోహం అయింది కమిన్స్ సేన.

ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(%బా=ఎ%) ఆట మారలేదు. బ్యాటింగ్, బౌలింగ్ వైఫల్యంతో వరుసగా నాలుగో ఓటమి మూటగట్టుకుంది. అచ్చొచ్చిన ఉప్పల్ స్టేడియంలో చెలరేగాల్సింది పోయి ప్రత్యర్థికి దాసోహం అయింది కమిన్స్ సేన. సిరాజ్(4-17) విజృంభణతో టాపార్డర్ కుప్పకూలగా.. నితీశ్ కుమార్ రెడ్డి (31), కెప్టెన్ కమిన్స్(27 నాటౌట్)లు పోరాడి గౌరవ ప్రదమైన స్కోర్ అందించారు. 153 పరుగుల ఛేదనలో 16కే 2 వికెట్లు పడినా శుభ్‌మన్ గిల్(61 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. ఆల్‌రౌండరష్ వాషింగ్టన్ సుందర్(49) మెరుపు బ్యాటింగ్‌తో జట్టు విజయానికి బాటలు వేశాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్ షెర్ఫానే రూథర్‌ఫర్డ్(35 నాటౌట్) లాంఛనం ముగించగా 7 వికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది.%ఐపీఎల్ 18వ సీజన్‌లో రికార్డు బ్రేకర్ సన్‌రైజర్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. సొంత మైదానంలోనైనా గెలుస్తుందనుకున్న కమిన్స్ సేన.. పేలవ ప్రదర్శనతో గుజరాత్ దూకుడు ముందు తలవంచింది. 153 పరుగుల ఛేదనలో గుజరాత్ ఆదిలో తడబడినా.. నింపాదిగా ఆడుతూ విజయం సొంతం చేసుకుంది. స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో సన్‌రైజర్స్ బౌలర్లు పవర్ ప్లేలో అదరగొట్టారు. ఓపెనర్ సాయి సుదర్శన్(5)ను ఔట్ చేసిన షమీ తొలి వికెట్ అందించాడు. ఆ కాసేపటికే జోస్ బట్లర్(0) ను కమిన్స్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. అయితే.. 16 పరుగులకే 2 వికెట్లు పడిన వేళ.. వాషింగ్టన్ సుందర్(23) ధాటిగా ఆడాడు. సిమర్‌జిత్ సింగ్ వేసిన 6వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదిన అతడు.. నాలుగో, ఆరో బంతిని ఫైన్ లెగ్‌లో సిక్సర్‌గా మలిచాడు. దాంతో, గుజరాత్ 6 ఓవర్లకు 48 రన్స్ కొట్టింది.

క్రీజులో పాతుకుపోయిన శుభ్‌మన్ గిల్(61 నాటౌట్), సుందర్ తాపీగా ఆడుతూ కీలక పరుగులు జోడించారు. ఓవర్‌కు ఒక బౌండరీ .. సింగిల్స్, డబుల్స్ తీస్తూ స్కోర్ బోర్డును నడిపించారు. దాంతో, 13వ ఓవర్లో 100కు చేరువైంది గుజరాత్. అర్ధ సెంచరీకి చేరువైన సుందర్.. షమీ బౌలింగ్‌లో కొట్టిన బంతిని అనికేత్ వర్మ డైవింగ్ క్యాచ్ అందుకోవడంతో అతడు పెవిలియన్ చేరాడు. దాంతో, మూడో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(35 నాటౌట్) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. అభిషేక్ శర్మ వేసిన 15వ ఓవర్లో ఆఫ్ సైడ్, లెగ్‌సైడ్.. హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. మరొక ఫోర్‌తో 18 పరుగులు పిండుకున్నాడీ హిట్టర్. అనంతరం జీషన్ బౌలింగ్‌లో గిల్.. రెండు ఫోర్లతో లక్ష్యాన్ని మరింత కరిగించాడు. కమిన్స్ వేసిన 17వ ఓవర్లో సిక్సర్, 4 కొట్టిన రూథర్‌ఫోర్డ్ జట్టుకు 7 వికెట్ల విజయాన్ని అందించాడు.

## నితీశ్, క్లాసెన్ పోరాడగా..

సొంతమైదానంలో రెచ్చిపోయి ఆడాతారని ఆశించిన అభిమానులను సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు మళ్లీ నిరాశపరిచారు. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిలకడ లేమిని కొనసాగించింది టాపార్డర్. ఇన్నింగ్స్ ఆరంభంలోనే గుజరాత్ టైటన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్(4-17) ఆరెంజ్ ఆర్మీకి పెద్ద షాకిచ్చాడు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(8), అభిషేక్ శర్మ(18)లను పెవిలియన్ పంపాడు.



### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 | 1.25 |
| బెంగళూరు | 3 | 2 | 1 | 4 | 1.14 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 4 | 0.80 |
| పంజాబ్ | 3 | 2 | 1 | 4 | 0.07 |
| కోల్‌కతా | 4 | 2 | 2 | 4 | 0.07 |
| లక్నో | 4 | 2 | 2 | 4 | 0.04 |
| రాజస్థాన్ | 4 | 2 | 2 | 4 | -0.18 |
| ముంబై | 4 | 1 | 3 | 2 | 0.10 |
| చెన్నై | 4 | 1 | 3 | 2 | -0.89 |
| హైదరాబాద్ | 4 | 1 | 3 | 2 | -1.61 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# చెమట వాసనా?

చంకల్లో ఎక్కువగా చెమట పట్టడాన్ని హైపర్ హైడ్రోసిస్ అంటారు. ఇబ్బంది కలిగించే ఈ సమస్య అందరిలోనూ తలెత్తుతుంది. అతిగా చెమట పట్టడం వల్ల బట్టల మీద మరకలు, దుర్వాసన, తరచుగా బట్టలు మార్చుకోవడం మొదలైన ఇబ్బందులు తలెత్తుతాయి. అంతేకాదు ఈ సమస్య మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.

హైపర్‌హైడ్రోసిస్‌కు కొన్ని చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులను సంప్రదించిన తర్వాతే తగిన చికిత్సను ఎంచుకోవాలి.

**ప్రిస్క్రిప్షన్ స్ట్రెంత్ యాంటీ పెర్స్‌పిరెంట్స్:** మామూలు డియోడరెంట్ల లాంటివి పనిచేయనప్పుడు డాక్టర్లను సంప్రదించాలి. వాళ్లు చంకల్లో అతి చెమటను నివారించే యాంటీ పెర్స్‌పిరెంట్స్ సిఫారసు చేస్తారు. వీటిలో అల్యూమినియం క్లోరైడ్ హెక్సాహైడ్రేట్ లాంటివి అత్యధిక గాఢతలో ఉంటాయి కాబట్టి, నిపుణుల సలహా మేరకే వాడాలి.

**టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్:** చంకల్లో అతి స్వేదం సమస్యకు టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్ తేలికగా అందు బాటులో ఉన్న చికిత్స సదుపాయాలు. వీటిలో ఉండే అల్యూమినియం క్లోరైడ్ స్వేద గ్రంథుల్ని మూసేస్తుంది. అలా ఎక్కువ చెమట వెలువడటాన్ని తగ్గిస్తుంది. టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్‌ను పడుకునే ముందు చంకల్లో పొడి చర్మం మీద పూతగా రాసుకుంటే ఫలితం కనిపిస్తుంది.



**బొటాక్స్ ఇంజెక్షన్స్:** చంకల్లో చెమటకు బొట్యులినమ్ టాక్సిన్ కలిగిన బొటాక్స్ ఇంజెక్షన్స్ సమర్థమైన చికిత్స అందిస్తాయి. బొట్యులినం టాక్సిన్ చంకల్లో చెమటను ప్రేరేపించే రసాయన సిగ్నల్స్‌ను అడ్డుకుంటాయి. కొన్ని నెలలపాటు ప్రభావం చూపే బొటాక్స్ ఇంజెక్షన్లను వైద్యుడి ద్వారానే తీసుకోవాలి. క్రమం తప్పకుండా ఇంజెక్షన్లు తీసుకుంటేనే అతి స్వేదం సమస్య నుంచి ఉపశమనం కొనసాగుతుంది.

**అయాన్‌టోఫోరసిస్:** ఇందులో భాగంగా నీళ్ల ద్వారాగానీ, లేదంటే తడి ప్యాడ్‌ను చంకల్లో ఉంచి ఓ మోస్తరు విద్యుత్తును చంకల్లోకి పంపిస్తారు. దీంతో స్వేద గ్రంథులు తాత్కాలికంగా పూడుకుపోతాయి. అలా అధికంగా చెమట పట్టడం నుంచి విముక్తి లభిస్తుంది. మంచి ఫలితాలు రావడానికి ఈ చికిత్సను కొన్ని వారాలకు ఒకసారి నిపుణుల పర్యవేక్షణలో చేయించుకోవాలి.

**లేజర్ చికిత్స:** లేజర్ అబ్లేషన్, లేజర్ లైపోలైసిస్ చంకల్లో చెమటకు మంచి చికిత్స. ఈ చికిత్సలో చంకల్లో స్వేద గ్రంథుల్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స చేస్తారు. దాంతో చెమట వెలువడటం తగ్గిపోతుంది. లేజర్ థెరపీతో చర్మంపై కోత తక్కువగా ఉంటుంది (మినిమల్లీ ఇన్వేసివ్). అదే సమయంలో సమస్యకు పరిష్కారం తొందరగా దొరుకుతుంది. కానీ, లేజర్ చికిత్స మీ చర్మానికి తగిందో కాదో డాక్టర్‌ను సంప్రదించాకే నిర్ధారించుకోవాలి.

**సర్జరీ ద్వారా:** మామూలు చికిత్సల ద్వారా హైపర్‌హైడ్రోసిస్ సమస్య ఏమాత్రం తగ్గకపోతే వైద్యులు సర్జరీని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఇలాంటివా టిలో ఆగ్జిలరీ స్వెట్ గ్లాండ్ సక్షన్ క్యూరెటేజ్ ఒకటి. దీని ద్వారా చంకల్లో స్వేద గ్రంథుల్ని పూర్తిగా తొలగిస్తారు. మరో చికిత్స థొరాసిక్ సింపథెక్టమీ. ఇందులో చెమట ఉత్పత్తికి మూలమైన నరాలను కత్తిరించిడం లేదా ముడివేయడం చేస్తారు. అయితే సర్జరీని చివరి అస్త్రంగా మాత్రమే ఎంచుకోవాలి. అదీ నిపుణుడిని సంప్రదించిన తర్వాతే.

## వెజిటేరియన్లు అయిన పిల్లలకు ప్రొటీన్ ఎలా?

# ఎలాంటి ఆహారం పెట్టాలి?

పిల్లల ఎదుగుదలకు ప్రొటీన్ చాలా అవసరం. కానీ శాకాహారులకు సాధారణ ఆహారంలో అది సరిపడినంత దొరకడం కష్టం అంటారు కదా! మరి వెజిటేరియన్లు అయిన పిల్లలు చక్కగా ఎదగాలంటే ఎలాంటి ఆహారం పెట్టాలి. జీడిపప్పు, బాదం లాంటి ఖరీదైనవి కాకుండా మామూలు ఆహారం తినేవాళ్లకు కూడా సరిపోయేలా ఏమైనా పదార్థాలు ఉన్నాయా? తెలుపగలరు.



చ నిర్మాణంలోనూ, దాని పనితీరులోనూ ఇది కీలకపాత్ర పోషిస్తుంది. మన శరీరంలోని సగానికిపైగా ప్రొటీన్ కండరం రూపంలో మిగతాది ఎముక, మజ్జ, చర్మాల్లో ఉంటుంది. 20 దాకా అమైనో యాసిడ్ల సమ్మేళనంగా ఇది తయారైక్కని పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలకు అత్యావశ్యకం. అందులోనూ శరీర నిర్మాణానికి ప్రొటీన్ చాలా అవసరం. ప్రతి కణంతే, అందులో 9 ముఖ్యమైన వాటిని మనం ఆహారం ద్వారా తీసుకోవలసిందే.

సాధారణంగా మాంసంలో దొరికే ప్రొటీన్‌లో ఇవన్నీ ఉంటాయి. శరీరం దాన్ని బాగా శోషించుకుంటుంది కూడా. కానీ శాకాహారం విషయంలో ఇలా ఉండదు. ఈ పదార్థాల్లో కొన్ని రకాల అమైనో యాసిడ్లు తక్కువగా దొరుకుతాయి. తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుల సమ్మేళనంగా మన ఆహారాన్ని మలచుకుంటే ఇవన్నీ దొరకడం కష్టమేం కాదు.ఇందుకోసం, 3:1 నిష్పత్తిలో ధాన్యాలు, పప్పులు కలిపి తీసుకోవాలి. రోజూ పావు లీటరు పాలు దీనికి జోడించాలి.

కందులు, పెసలు, ఉలవలు, మినుములు, బఠాణీలు, శనగలు, బొబ్బర్లు, బీన్స్‌లాంటి చిక్కుడు జాతి గింజల్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. అలాగే బాదం, పిస్తా, జీడిపప్పు, వాల్‌నట్స్, నువ్వులు, గుమ్మడి, అవిసె గింజల్లో కూడా ఇది అధిక మోతాదులో దొరుకుతుంది.విభిన్న రకాల రుచికరమైన వంటల రూపంలో వీటిని ఆహారంలో భాగం చేయడం ద్వారా మనం పిల్లలకు కావలసిన ప్రొటీన్‌ని అందించగలుగుతాం.

ఉడికించిన శనగలు, అలసందలు, బొబ్బర్లతో గుగ్గిళ్లు చేసి పెట్టొచ్చు. పెసరట్టు పప్పుల చట్నీ, పెసలు కందులు వేసిన కిచిడీలు, బిసిబేళా బాత్, పచ్చి శనగపప్పు గోధుమపిండితో చేసే పోలెలు కూడా మంచివే.

పనీర్ పులావ్, సోయా పులావ్ లాంటివీ బాగుంటాయి. మొలకెత్తిన గింజలతో చేసే స్టీమ్డ్ టిక్కా, సున్నుండల్లాంటివి బలాన్నిస్తాయి. ఇడ్లీ, దోశల్లోనూ ప్రొటీన్ దొరుకుతుంది.

బతుకమ్మ పండుగకు చేసే రకరకాల సత్తుపొడులు, శనగపప్పు కలిపి చేసే సర్వపిండి కూడా ఈ కోవలోవే.

పండ్లలో గింజల్ని కలిపి ఇవ్వచ్చు. దానిమ్మ గింజల్లో గుమ్మడి, పుచ్చ లేదా సన్‌ఫ్లవర్ గింజల్లాంటివి కలిపి పెట్టొచ్చు.

గ్లాసెడు పాలల్లో డ్రైఫ్రూట్ పొడి కలిపి, లేదా చిరుధాన్యాలను మొలకెత్తించి బెల్లంతో కలిపిన పొడి కలిపి ఇవ్వచ్చు.

మజ్జిగ, పెరుగు, చల్లచారు కూడా ప్రొటీన్ అందించేవే.

## కుంకుమ పువ్వును ఇలా వాడితే..

# డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన పనిలేదు..!

కుంకుమపువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో ఒకటి. నిజానికి కుంకుమ పువ్వును క్రోకస్ సాటివస్ అనే మొక్క పువ్వు పుప్పొడి నుంచి సేకరిస్తారు. ఈ పుప్పొడి రేకులను ఎండబెట్టి కుంకుమ పువ్వుగా చేస్తారు. కుంకుమ పువ్వును ఆంగ్లంలో సాఫ్రాన్ అంటారు. కుంకుమపువ్వును రకరకాల స్వీట్లను తయారు చేయడం వాడుతారు. ఆయుర్వేదం పరంగా కూడా దీన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవచ్చు.

కుంకుమపువ్వులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, థయామిన్, ఫోలేట్, విటమిన్ బి6, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. కుంకుమ పువ్వు ఆయుర్వేదంలో ఒక అద్భుతమైన ఔషధ మూలిక. అనేక ఆరోగ్య సమస్యల నుండి బయటపడేందుకు కుంకుమపువ్వును తీసుకుంటారు. కుంకుమ పువ్వు వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు



**నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది:** కుంకుమపువ్వులో ఒత్తిడిని తగ్గించే చాలా శక్తివంతమైన పదార్థాలు ఉన్నాయి, ఇవి మీ మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. మీరు బాగా ఎక్కువసేపు నిద్రపోవడానికి సహాయపడతాయి. మీకు నిద్రలేమి వంటి సమస్యలు ఉంటే, మీరు ప్రతిరోజూ కుంకుమపువ్వును తీసుకోవాలి. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**జీర్ణ సంబంధిత సమస్యల నుండి ఉపశమనం:** ఔషధ గుణాలు కలిగిన కుంకుమపువ్వును తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు నయమవుతాయి. గ్యాస్, అజీర్ణం ఆమ్లత్వం మొదలైన వాటి నుండి ఉపశమనం వంటిది. కాబట్టి రోజూ పాలతో కుంకుమపువ్వును తినండి.

**కుంకుమపువ్వు కంటి చూపును మెరుగుపరుస్తుంది:** కుంకుమపువ్వు కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయ పడతాయి. వయసు పెరిగే కొద్దీ దృష్టిలోపం ఉన్నవారు కుంకుమపువ్వు తీసుకోవడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఇందులో క్రోసిన్ సఫ్రానల్ వంటి కెరోటినాయిడ్లు ఉన్నాయి, ఇవి కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది:** ఆయుర్వేద వైద్య పద్ధతుల ప్రకారం, కుంకుమపువ్వు మానసిక శక్తిని పెంపొందిం చడంలో చాలా ప్రభావవంతమైనదిగా పరిగణించబడుతుంది. ఇందులో కుంకుమపువ్వులో ఉండే ప్రత్యేక యాంటీఆక్సిడెంట్లు అల్జీమర్స్ వ్యాధి లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి.

**బరువును తగ్గిస్తుంది:** ఒక చిటికెడు కుంకుమపువ్వు మీ ఆకలిని అరికట్టడంలో సహాయపడుతుంది, తద్వారా మీకు అతిగా తినే అలవాటు ఉంటే దానిని దూరం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కుంకుమపువ్వు తీసుకోవడం మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. .

**చర్మ సౌందర్యం పెంచుతుంది:** కుంకుమపువ్వులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలు, బ్లాక్ హెడ్స్ మచ్చలు వంటి చర్మ సంబంధిత సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి.

**కుంకుమపువ్వు ఎలా తీసుకోవాలి?**

కుంకుమపువ్వును అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. పాలలో కుంకుమపువ్వు కలిపి త్రాగడం ఒక మంచి పద్ధతి. కుంకుమపువ్వులో అనేక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్షణాలు ఉన్నాయి, కాబట్టి దీనిని అనేక సాంప్రదాయ ఔషధాలలో కూడా ఉపయోగిస్తారు. అయితే కుంకుమ పువ్వు అతిగా వాడితే అజీర్తి చేసే అవకాశం ఉంటుంది. అందుకే మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి కుంకుమపువ్వు ఎంత మోతాదులో తీసుకోవాలో తెలుసుకోవడానికి వైద్యుడిని సంప్రదించండి.



# పోహా వహ్వా!

**పోహాను మనం అటుకులు అని పిలుస్తాం. ఇవంటే శ్రీకృష్ణ భగవానుడికి ఎంతో ఇష్టమని తెలిసిందే. అందుకే, కష్టాల్లో ఉన్న కుచేలుడు తన మిత్రుడికి గుప్పెడు అటుకులు తీసుకువెళ్తాడు. అపారమైన సంపదలు వరంగా పొందుతాడు. ఉదయం వేళ, సాయంత్రాల్లో ఉపాహారంగా పోహాను మించిన మంచి ఆహారం ఇంకోటి లేదంటే అతిశయోక్తి కాదు. భూమ్మీద మనిషి తొలి చిరుతిండ్లలో పోహా ఒకటి.**

**అరుగుదల తేలిక...**

పోహాను పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఎవ్వరైనా సరే నిరభ్యంతరంగా తినేయవచ్చు. తేలికగా అరిగిపోతాయి. అంతేకాదు వీటితో ఉపాహారం చేసుకోవడం క్షణాల్లో పని.

**శక్తిదాయిని...**

పోహా శరీరానికి శక్తిని ఇచ్చే ఆహారపదార్థం. దీంతో తిన్న వెంటనే కొంతసేపటి వరకు చురుగ్గా ఉంటాం. పిండిపదార్థాలు మాత్రమే ఉండే ఇతర పదార్థాలతో పోలిస్తే పోహా ఆరోగ్యకరమైనది. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలోకి చక్కెరను నిదానంగా విడుదలయ్యేలా చేస్తుంది కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారికీ పోహా మంచి ఆహారమే. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. పైగా ఇది గ్లూటెన్ ఫ్రీ కూడా. గ్లూటెన్ అలర్జీ ఉన్నవాళ్లూ ఎంచక్కా తినొచ్చు.

**పోషకాల పెన్నిధి...**

పోహాలో ఐరన్ కొద్దిమొత్తంలో ఉంటుంది. ముడిబియ్యంతో చేస్తారు కాబట్టి బి విటమిన్ కూడా ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్ కోసం పోహాలో పల్లీలు జోడిస్తాం. దీంతో ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు కలిసి పోహాను మరింత ఆరోగ్యకరంగా మారుస్తాయి. నిమ్మరసం చిలకరించడంతో విటమిన్ సి తోడవుతుంది. ఇది అటుకులు, పల్లీల్లో ఉండే ఐరన్ శరీరానికి అందేలా దోహదపడుతుంది.

**మరింత ఆరోగ్యం కావాలా?**

అయితే రెడ్ రైస్‌తో తయారైన అటుకులు తీసుకోవాలి. వీటికి ఎర్ర రంగును ఇచ్చేది ఆంథోసైనిన్ అనే పిగ్మెంట్. పైగా ఇది యాంటీఆక్సిడెంట్ కూడా. ఇందులో ఫైబర్, విటమిన్ బి, కాల్షియం, జింక్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటాయి.

**రకరకాలుగా...**

అటుకులను తీసుకుని. ఆవాలు, కరివేపాకు, పల్లీలు, ఆలుగడ్డ ముక్కలు, బఠానీలతో పోపు వేసుకోవాలి. దీనిపై నిమ్మరసం చిలకరించుకోవాలి. అవసరం అనుకుంటే పుట్టగొడుగులు, మిరియాలు, చీజ్ కలుపుకోవచ్చు. పాలకూర కూడా వేసుకోవచ్చు. టోఫు, మొలకలు, సోయా ఉండలు జోడించి మరింత రుచికరంగా మార్చుకోవచ్చు.

**ఎలా తిన్నా మంచిదే...**

కొంతమంది అటుకులకు పెరుగు కలుపుకొనీ తింటారు. ఇలా చేయడం వల్ల శరీరానికి కాల్షియం అందుతుంది. అటుకులు, ఆవకాయ, పెరుగు మిశ్రమం రుచి తెలుగువారికి పాత అనుభూతే. కొంతమంది చక్కెర వేసిన పాలలో అటుకులు కలుపుకొని కూడా తింటారు. ఎలా తిన్నా అటుకులు మంచే చేస్తాయి.

# ఒత్తిడి తిండి.. ముప్పేనండి



ఉరుకులు పరుగుల జీవితం కొన్నిసార్లు ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన, తలనొప్పులు, గుండె, శ్వాస సమస్యలు తదితర మానసిక, శారీరక దుష్ప్రభావాలకు దారితీస్తున్నది. ముఖ్యంగా ఉద్యోగాలు చేస్తున్న వారిలో గడిచిన కొన్నేళ్లుగా ఒత్తిడి తిండిగా పిలిచే-స్ట్రెస్ ఈటింగ్ పెరిగిపోతున్నది. ఇది రాత్రిళ్లు ఉద్యోగాలు చేసేవారిలో మరీ అధికంగా ఉందంటున్నారు నిపుణులు. అయితే, చాలామందికి తమ జీవిత విధానం ఎలా ఉందో గమనించుకునే తీరిక లేకుండా పోయింది. ఈ సమస్యను వదిలించుకోవడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి.

**కారణాలు**

- ప్రతికూల ఆలోచనలు ఉన్నవాళ్లు వాటిని నియంత్రించుకోవడం ఎలాగో తెలియకపోవడంతో ఏదో ఒకటి ఆబగా తినేస్తుంటారు.
- అధిక ఒత్తిడి శరీరంలో సెరటోనిన్ స్థాయిల మీద ప్రభావం చూపుతుంది. దీనివల్ల ఎక్కువ కొవ్వు, చక్కెర ఉన్న ఆహారం పట్ల నాలుక గుంజుతుంది.
- మితిమీరిన ఆందోళన కూడా తిండి ఎక్కువగా తినడానికికారణమవుతుంది.
- వ్యాయామం చేయకపోవడం వల్ల విసుగ్గా ఉంటుంది. దీంతో మనసు అనారోగ్యకరమైన జంక్‌ఫుడ్ వైపు మళ్లుతుంది.



**దుష్ప్రభావాలు**

- కావాల్సిన దానికంటే ఎక్కువగా తింటాం. తినే తిండి మీద నియంత్రణ ఉండదు.
- టీవీ చూస్తూ, స్మార్ట్‌ఫోన్లు వాడుతూ పరిమితికి మించి తింటూ ఉంటాం. ఇది ఊబకాయానికి దారితీస్తుంది.
- టైప్ 2 డయాబెటిస్, అధిక రక్తపోటు, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, గుండె కవాటాలకు సంబంధించిన సమస్యల బారినపడతాం.



**ఇవి తినొచ్చు**

- ఆపిల్, అరటి, ద్రాక్ష, నారింజ, జామ, బాదం, కాజు లాంటి ఆరోగ్యాన్నిచ్చే పండ్లు, గింజలు తీసుకోవాలి.
- విటమిన్లు, ఐరన్‌తో నిండిన తాజా పండ్లరసాలను తాగాలి.
- గుమ్మడి గింజలు, గ్రీన్ టీ, చేమంతి టీ (చమోమైల్ టీ), గుడ్లు లాంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- బటర్ లేకుండా స్వీట్‌కార్న్, పాప్‌కార్న్ తీసుకుంటే మంచిది.

**కొన్ని చిట్కాలు**

- తినే మోతాదు తగ్గించుకోవాలి.
- రోజూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తగిన మోతాదులోనే తీసుకోవాలి.
- శ్వాస వ్యాయామాలు, ధ్యానం, యోగా లాంటివి సాధనచేయాలి.
- బరువును గమనించుకుంటూ ఉండాలి.
- టీవీలు చూస్తున్నప్పుడు, పనులు చేస్తున్నప్పుడు తినడం మానుకోవాలి.
- కాఫీ, స్వీట్లను పక్కనపెట్టాలి. ఇవి ఆందోళనను పెంచుతాయి.
- అవసరమైతే ఆహార నిపుణులను, డాక్టరును సంప్రదించాలి.